

కూటమిలోని ఓ పార్టీకి చెందిన సంతనూతలపాడు నియోజకవర్గ ముఖ్యనేత మద్యం ఆదాయంపై కన్నేశారు. వ్యాపారులను ముందే గుర్తించి వారిని తన గుప్పెట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. దుకాణాన్ని ఎవరు దక్కించుకున్నా తమ సహకారం లేకుండా మీరు వ్యాపారం చేయలేరని హెచ్చరికలు జారీ చేసి దారికి తెచ్చుకుంటున్నారు.

దర్శి నియోజకవర్గంలో అధికార కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన నేత బంధువు ఒక అడుగు ముందుకేశారు. 'ఎవరూ తొందరపడి డబ్బులు పోగొట్టుకోకండి. నేను చెప్పిన వాళ్లే దరఖాస్తు చేసుకోండి. మిగిలిన వారికి వ్యాపారంలో వాటా ఇప్పిస్తా' అని సిండికేట్‌కు సిద్ధమయ్యారు.

పక్కన పేర్కొన్న రెండు నియోజకవర్గాలే కాదు. మార్కాపురం, ఒంగోలుతోపాటు పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. అధికార కూటమి నేతలు మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మలుచుకుంటున్నారు. కుదిరితే దుకాణాలను దక్కించుకోవడం.. లేకపోతే తమ అనుచర గణానికి వచ్చేలా చేయడం.. అదీ సాధ్యపడకపోతే ఆశావహులను నయానో భయానో దారికి తెచ్చుకొనైనా వాటా దక్కించుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. దరఖాస్తుదారులు ఎవరైనా ఈ సిండికేట్‌కు సిద్ధపడకుంటే నేతల నుంచి హెచ్చరికలు.. బెదిరింపులు పెరుగుతున్నాయి. దీనికి భయపడి అనేక మంది వెనకడుగు వేస్తున్నారు. ఈ కారణంగా దరఖాస్తుల సంఖ్య చాలా తగ్గింది. మరో రెండ్రోజుల్లో గడువు ముగియనుండటంతో ఔత్సాహిక వ్యాపారులపై బెదిరింపులు మరింత తీవ్రమయ్యాయి.



- మద్యం దుకాణాలపై నేతల దృష్టి
- నియోజకవర్గాల వారీగా సిండికేట్
- ధిక్కరించే వారికి బెదిరింపులు
- మా అండలేకుండా వ్యాపారం చేయలేరని హెచ్చరికలు
- కొన్నిచోట్ల బేరాలు
- ఆదాయంలో వాటాలకు సెటిల్మెంట్లు
- వెనకడుగు వేస్తున్న వ్యాపారులు
- 111 దుకాణాలకు ఇప్పటి వరకూ అందింది 229 దరఖాస్తులే
- రెండ్రోజుల్లో ముగియనున్న గడువు

మా ప్రాంతంలో మావారే!

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ కూటమి నేతలు దృష్టి సారించారు. వారి అండ లేకుండా వ్యాపారం చేయడం కష్టమని అనేకమంది వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ మద్దతుదారులుగా గుర్తింపు ఉన్నవారు, అధికార పార్టీలోని ముఖ్యనేతల అండదండలు అంతగా లేనివారు దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు వెనుకాడుతున్నారు.


ఆదాయంపై కూటమి నేతల కన్ను

నూతన మద్యం పాలసీలో ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు ఇవ్వడం ద్వారా దరఖాస్తు ఫీజు రూపంలోనే సగటున ఒక్కో షాపునకు రూ.కోటి వరకూ పొందాలన్నది ప్రభుత్వ ఆలోచన. అయితే జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. తాజా విధానంలో వ్యాపారి కమీషన్ 20 శాతానికి పెంపు, లైసెన్సు పొందిన దుకాణాన్ని ఆ పట్టణం లేదా మండలంలో వ్యాపారి తన ఇష్టం ఉన్న చోట ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పించడంతో లాభాలు వస్తాయన్న ఆశలు పెరిగాయి. దీంతో అధికార కూటమి నేతలు ఈ వ్యాపారంపై కన్నేశారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుతం అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధులకు గతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్యం వ్యాపారంతో సంబంధాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల ద్వితీయ శ్రేణి నేతల్లో అలాంటి వారున్నారు. దీంతో వివిధ ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు.

ఆశావహులకు హెచ్చరికలు..

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేస్తారన్న అనుమానం ఉన్న వారికి ప్రధాన పార్టీ నేతల నుంచి పరోక్షంగా హెచ్చరికలు వెళుతున్నాయి. 'మా ప్రాంతంలో మేమే లేదా మావాళ్లు వ్యాపారం చేసుకుంటారు. మాకు తెలియకుండా ఎవరూ దరఖాస్తులు చేయొద్దు. కాదని ఎవరైనా దరఖాస్తు చేసి షాపు దక్కించుకున్నా వ్యాపారం చేయలేరు' అని హెచ్చరిస్తున్నారు.

- మార్కాపురం, దర్శి, కనిగిరి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఈ తరహా హెచ్చరికలు వెళ్లాయని ప్రచారం జరుగుతోంది.
- ఇంకొన్ని నియోజకవర్గాల్లో ముందుగా ఇలాంటి హెచ్చరికలు చేసి ప్రజల్లో వ్యతిరేకతలు మూటగట్టుకోవడం కన్నా దుకాణాల లైసెన్సులు పొందినవారు మన సహకారం లేకుండా వ్యాపారం చేయలేరు కాబట్టి అప్పుడు చూసుకుందామని వేచిచూసే ధోరణిలో ఉన్నట్టు తెలిసింది.
- కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలే పోటీ పడి దరఖాస్తు చేసుకొనే పరిస్థితి ఉండటంతో భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ముందుగానే వారిని సిండికేట్ చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. వీటన్నింటి ప్రభావం మద్యం దుకాణాలకు దరఖాస్తులపై పడుతోంది.



వ్యాపారులకు 20 శాతం కమీషన్

గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలను సర్కారే నిర్వహించింది. అనామక బ్రాండ్లతో అమ్మకాలు చేపట్టి అభాసుపాలైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పు తెచ్చింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు విధానాన్నే టీడీపీ తిరిగి అమల్లోకి తెచ్చింది. బహిరంగంగా దరఖాస్తులకు ఆహ్వానం పలికింది. లైసెన్సు ఫీజులు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు దుకాణాల ఏర్పాటుకు అనుమతులిచ్చింది. వ్యాపారులకు కమీషన్ పెంచింది. గతంలో 13 శాతం కమీషన్ ఇవ్వగా ఇప్పుడు 20 శాతానికి పెంచింది. పట్టణాలు, మండలాలు యూనిట్‌గా దుకాణాలు ప్రకటించి ఆ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

జిల్లాలో 171 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో అర్బన్ ప్రాంతాలు, వాటికి సమీప మండలాల్లో ఏడాదికి రూ.65 లక్షలు, ఇతర మండలాల్లో రూ.55 లక్షలు లైసెన్సు ఫీజుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం జిల్లాలో 120 దుకాణాలకు రూ.65 లక్షలు, 71 దుకాణాలకు రూ.55 లక్షల చొప్పున లైసెన్సు ఫీజు చెల్లించాలి. అయితే దరఖాస్తు చేసే ప్రతి ఒక్కరూ ఒక్కో దుకాణానికి రూ.2లక్షలు ఫీజు చెల్లించాలి. ఎవరు ఎన్ని దుకాణాలకు అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తు ఫీజును వాపసు ఇవ్వరు. ఆ మేరకు నోటిఫికేషన్ ఇచ్చి ఈనెల 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

మందకొడిగా దరఖాస్తులు

ఈనెల 1 నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ఆశించిన స్పందన రావడం లేదు. జిల్లాలో 171 దుకాణాలకు నోటిఫికేషన్ ఇస్తే ఆదివారం సాయంత్రానికి 111 దుకాణాలకు 229 దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటి ద్వారా రూ.4.58 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ యస్.కె. ఖాజామొహిద్దీన్ తెలిపారు. 60 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 9వ తేదీ సాయంత్రంతో ముగియనుంది. వాటి పరిశీలన 10న ఉంటుంది. 11న దుకాణాల కేటాయింపునకు ఒంగోలులో లాటరీ తీస్తారు. దుకాణం పొందినవారు 12వ తేదీ నుంచి వ్యాపారం ప్రారంభించుకొనేలా షెడ్యూల్ రూపొందించారు.

- పైసలిస్తేనే గ్రేడ్-5,6 కార్యదర్శులకు పోస్టింగ్
- ఒక్కొక్కరి వద్ద రూ.30వేల నుంచి రూ.50వేలు వసూలు
- అక్రమాలపై కలెక్టర్ అన్సారియా ఆరా
- అయినా మారని అధికారి తీరు
- కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం



కొనసాగుతున్న వసూళ్ల పంచాయితీ

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 6 : గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. పైసలు తీసుకొని పోస్టింగ్‌లు ఇస్తున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈ విషయమై కలెక్టర్ అన్సారియా ఆరా తీసినప్పటికీ ఆశాఖ అధికారులు, ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'వసూళ్ల పంచాయితీ' శీర్షికన ప్రచురితమైన కథనం కలకలం రేకెత్తించింది. అయినప్పటికీ ఆ శాఖ అధికారి మాత్రం ఒక్కో పోస్టుకు రేటు నిర్ణయించి కొనసాగించడాన్ని బట్టి చూస్తే ఎంతకు బరి తెగించారో అర్థమవుతుంది.

ఇద్దరు ఉద్యోగుల కీలక పాత్ర

వసూళ్ల విషయంలో ఇద్దరు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవల వరకూ జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేసి రిలీవ్ అయిన ఒక ఉద్యోగితోపాటు, కార్యాలయంలో సదరు సెక్షన్‌లో పనిచేసే మరో ఉద్యోగి వసూల్ రాజాల అవతారం ఎత్తినట్లు సమాచారం. అడిగినంత ఇస్తేనే బదిలీ అర్డర్ చేతిలో పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో నెల క్రితం గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినా ఇంత వరకూ పోస్టింగ్‌లు ఇవ్వలేకపోయారు. ఒక్కో ఉద్యోగి రూ.30 వేల నుంచి రూ.50 వేలు చెల్లిస్తేనే బదిలీ ఉత్తర్వులు ఇస్తున్నట్లు సమాచారం. ఆరెండు విభాగాల్లో సుమారు 500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. దీంతో వారి వద్ద నుంచి భారీ మొత్తంలో రాబట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు ఉద్యోగుల ద్వారా వసూళ్ల పర్వం

మండల అధికారికి అందని సమాచారం

సాధారణ బదిలీలు అయితే వెంటనే ఆ ఆర్డర్లను సంబంధిత ఉద్యోగికి ఇవ్వడంతో పాటు మండల స్థాయి అధికారికి మెయిల్ ద్వారా సమాచారం పంపించాల్సి ఉంది. కానీ ఆవిధంగా చేస్తే ఉద్యోగులు ఆఫీసుకురారని, తమకు అమ్యామ్యాలు అందవన్న కారణంతో వాటిని సదరు వసూల్ రాజాలు తమ వద్దనే పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆర్డర్లు బయట పెడితే ప్రజాప్రతినిధులు చేసిన సిఫార్సుల ప్రకారం బదిలీలు జరగని విషయం బహిర్గతమైతే ఇబ్బందులు ఎదురవుతాయన్న మరో కారణంతో కూడా వారు జాగ్రత్త పడుతున్నారు. మొత్తం మీద అటు ప్రజాప్రతినిధుల నుంచి ఇబ్బందులు లేకుండా, ఇటు తమ జేబులు నిండేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఒక కీలక ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలోని గ్రేడ్-5 ఉద్యోగిని నియమించాలని సిఫార్సు చేశారు. కానీ ఆయన చెప్పిన పేరు కాకుండా మరొకరిని ఆ పోస్టులో నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



హాజరైన పూర్వ విద్యార్థులు (వృత్తంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి)

అ'పూర్వ' కలయిక

గిద్దలూరు టౌన్, అక్టోబరు 6 : పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలలో 1983-85-88 ఇంటర్మీడియట్, డిగ్రీ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీటా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాటి సహచరులతోపాటు ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థి అయిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఒకే వేదికపై మిత్రులందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు హనుమంతరెడ్డి, శోభన్‌బాబు, దప్పిలి రంగారెడ్డి, జీవనజ్యోతి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై రేపు ప్రజాప్రతినిధులతో సమావేశం



కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై మంగళవారం జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరగనుంది. వికసిత భారత్-2047 పేరుతో కేంద్రం, స్వర్ణాంధ్ర పేరుతో రాష్ట్రప్రభుత్వాలు విజన్ డాక్యుమెంట్లు రూపొందిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికను నవంబరు1న విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించి వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలను తీసుకుంటున్నారు. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో కీలక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా ఈనెల 8న జిల్లా స్థాయి సమావేశాన్ని కలెక్టర్ అన్సారియా ఏర్పాటు చేశారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో ఇది జరగనుంది. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానం పంపారు.

పోలీసుల వేధింపులకు యువకుడి బలి

- 2న ఎలుకల మందు తిన్న రాజశేఖర్
- చికిత్స పొందుతూ మృతి
- న్యాయం చేయాలని బంధువుల ఆందోళన
- వీఆర్‌కు ఏఎస్సై, కానిస్టేబుల్

ఒంగోలు (క్రైం), అక్టోబరు 6 : పోలీసుల వేధింపులు ఓ యువకుడి ప్రాణం తీశాయి. విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి హింసించడంతో ఈనెల 2న ఎలుకల ముందుతిన్న పరుచూరి రాజశేఖర్ (36) ఆదివారం మృతి చెందారు. దీంతో న్యాయం కోరుతూ ఆయన బంధువులు వైద్యశాల వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని సమతానగర్‌లో నివాసం ఉండే రాజశేఖర్ కొత్తపట్నం మండలం మడనూరులోని వింటోస్ హేచరీస్‌లో 2020 నుంచి 2022 వరకూ మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో లావాదేవీల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని రెండేళ్ల తర్వాత హేచరీస్ యజమాని సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో రాజశేఖర్‌ను ఒంగోలు టూటౌన్ స్టేషన్‌కు పిలిపించి వేధించినట్లు ఆయన భార్య అంజలి ఆరోపించారు. తన భర్తపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో ఆయన ఈనెల 2న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడని రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులకు ఆమె అదేరోజు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న రాజశేఖర్ ఆదివారం మృతి చెందారు. తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో హేచరీస్ యజమాని సుధాకర్, మృతుడి బంధువుల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం వారు ఆందోళన విరమించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



చనిపోయిన రాజశేఖర్

ఎనిమిది పేజీల సూసైడ్ నోట్

ఈనెల 1న స్టేషన్‌కు వెళ్లి వచ్చిన అనంతరం పోలీసులు చేసిన అవమానం, వేధింపులపై రాజశేఖర్ ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ డైరీలో రాసినట్లు బంధువులు తెలిపారు. హేచరీస్ యజమానితో చర్చలు ఫలప్రదం కావడంతో ఈ నోట్‌ను బయట పెట్టలేదు. పోలీసులు కూడా సూసైడ్ నోట్ విషయాన్ని నిర్ధారించలేదు. రాజశేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించి వేధించి, హింసించి అంగీకారపత్రం రాయించుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒంగోలు టూటౌన్ ఏఎస్సై చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై ఎస్పీ దామోదర్ చర్యలు తీసుకున్నారు. వారిద్దరినీ వీఆర్‌కు పిలిచారు.



ఎక్సైజ్‌లో బదిలీల రగడ

- గడువు ముగిసిన తర్వాత 18 మందితో జాబితా సిద్ధం
- అడ్డం తిరిగిన ఓ సీఐ
- ఒత్తిడి పెంచుతున్న ప్రజాప్రతినిధులు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 6 : ఎక్సైజ్ శాఖలో బదిలీల రగడ నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు గతనెల 30తో ముగియగా, ఇప్పుడు పాత తేదీలు వేసి 18 మందితో జిల్లా అధికారి జాబితాను సిద్ధం చేయడం వివాదాస్పదమైంది. ఓ సీఐ ఎదురుతిరగడంతో ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎక్సైజ్ శాఖలో హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బదిలీల్లోనూ ఈసారి రాజకీయ జోక్యం శ్రుతిమించింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండా వారిని అధికారులు కదిలించలేకపోయారు. విధిలేని పరిస్థితుల్లో కొందరిని వారు అడిగిన చోటుకు బదిలీ చేయలేకపోయారు. దీంతో ఎక్సైజ్ అధికారులపై రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఈనేపథ్యంలో ఆ శాఖ జిల్లా అధికారి 18 మందితో ఒక జాబితాను సిద్ధంచేసి గత నెల 30వతేదీ లోపే పోస్టింగ్‌లు ఇచ్చినట్లు లేఖను కూడా తయారు చేశారు. అయితే ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎదురు తిరిగారు. బదిలీలను అడ్డుకున్నారు. తన స్టేషన్‌లో ఆరుగురు పని చేస్తున్నారని, వారిలో ముగ్గురిని బదిలీ చేస్తే అంతే సంఖ్యలో సిబ్బందిని ఇవ్వాలని భీష్మించారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టడాన్ని ఆయన ఆక్షేపించినట్లు తెలిసింది. దీంతో ఎక్సైజ్ అధికారులు వెనకడుగు వేసి జాబితాను గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

ప్లాస్టిక్ నిషేధమా..అదెక్కడ?

నానాటికీ పెరుగుతున్న వినియోగం

చెత్త సంపదకేంద్రాలను వినియోగంలోకి తెస్తేనే ప్రయోజనం



మైనంపాడులో నిరుపయోగంగా చెత్తసంపదకేంద్రం



మైనంపాడులో చెత్తసంపదకేంద్రం పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

సంతనూతలపాడు, అక్టోబరు 6: పర్యావరణానికి పెనువిఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారుల తనిఖీలు మొక్కుబడిగా సాగుతుండటంతో వ్యాపారులు, వినియోగదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. కట్టడి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుడటంతో దుకాణాల్లో వ్యాపారులు యథేశ్చగా విక్రయిస్తున్నారు. ఫలితంగా ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువై పర్యావరణ పరిరక్షణకు అందరూ తూట్లు పొడుస్తున్నారు. గతంలో సరుకులు తెచ్చుకునేందుకు నేత సంచిని తీసుకెళ్లేవారు. ప్రస్తుతం దుకాణానికి వెళ్లిన కనీసం రెండు, మూడు ప్లాస్టిక్ కవర్లు ఇంటికి తెస్తున్నారు. ఆ తర్వాత పడేయడంతో మురుగుకాలువల్లో, ఇతర ఖాళీ ప్రాంతాల్లో కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా అమలు కావడం లేదు.

అవగాహన లేక..

గ్రామాల్లో ఏదైన కార్యం జరిగితే అక్కడ వినియోగించే గ్లాసులు, ప్లేట్లు అన్నీ ప్లాస్టిక్‌తో చేసినవే అధికంగా ఉంటున్నాయి. 120 మైక్రాన్‌లకంటే తక్కువ మందమున్న ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా వాటిని అన్ని దుకాణాల్లో వినియోగిస్తున్నారు. వీటిపై అవగాహన లేకపోవడంతో గ్రామస్థులు వాడేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గతంలో దిబ్బ ఎరువును పొలాల్లో వేస్తే ఎలాంటి చెత్త చెదారాలు కనిపించేవి కావు. నేడు ఎరువును పొలాలకు తరలిస్తుంటే అందులో ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా కనిపిస్తున్నాయంటే వాటి వినియోగం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మూలనపడిన చెత్త సంపద కేంద్రాలు

గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించినా వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించేందుకు వాహనాలను, రిక్షాలను కేటాయించారు. అవి కొన్ని రోజులు మాత్రమే తిప్పారు. ఆ తర్వాత కార్యాలయాలకు పరిమితమయ్యాయనే ఆరోపణలు ఆయా గ్రామాల ప్రజల నుంచి వినపడుతున్నాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతోంది. అందులోను ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉండటం గమనార్హం. వీటిని ఎక్కడ వేసినా అవి చుట్టుపక్కల పొలాల్లోకి వెళ్తున్నాయి. దీంతో భూసారం తగ్గి పంటలు సరిగా పండని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మందుబాబులకు అడ్డాగా..

మండలంలోని చెత్త సంపదకేంద్రాలు మందుబాబుల అడ్డాగా మారాయి. చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉండటంతో వారికి అనుకూలంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపదకేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం



వెంకటేశ్వరరావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయ సమావేశపుహాలులో ఆదివారం జరిగిన ఎన్నికకు కె.ప్రకాశరావు ఎన్నికల అధికారిగా, ఎంసీ కాశన్న సహాయ ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా డీ ఎస్ఎన్.శ్రీనివాస్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా శివచంద్రకుమార్, కోశాధికారిగా ఆర్.జయరావులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు వెంకటేశ్వరరావుకు రాష్ట్ర అధ్యక్షుడు పీవీ.సాయికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ. రవికుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీమన్నారాయణ, ఎస్.పాపారావు, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ భారీసాయం



వంట సామగ్రి, దుప్పట్లను అందజేస్తున్న ప్రకాష్‌బాబు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 6: విజయవాడ వరద బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సుమారు రూ.3 కోట్ల విలువైన భారీ సహాయాన్ని ఆదివారం అందజేసింది. రాష్ట్రంలోని 23 జిల్లాల రెడ్‌క్రాస్ శాఖల సహకారంతో వరద బాధితులు ఒక్కొక్కరికీ రూ.12 వేల విలువైన వంట సామగ్రి, దుప్పట్లు, దోమతెరలు అందించినట్లు ప్రకాశం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు తెలిపారు. మన జిల్లానుంచి 150 కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఇతర సభ్యులు పాల్గొనగా వారిని రాష్ట్ర చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, సీఈవో ఏకే.ఫరీదాలు అభినందించారు.

ఫ్యాన్సీ గూడ్స్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 6: ఒంగోలు ఫాన్సీ గూడ్స్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో దేవతు శ్రీరాములు గౌరవ అధ్యక్షులుగా ఎన్నిక కాగా కూరపాటి సత్యనారాయణ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా తాతా వెంకటచెంచయ్యగుప్తా కార్యదర్శిగా, పేర్ల రామ్మోహనరావు కోశాధికారిగా, తాతా శ్రీనివాసులు, దేవతు వినోద్ కృష్ణారావు వైస్ ప్రెసిడెంట్‌గా, పేర్ల లక్ష్మీనారాయణ జాయింట్ సెక్రటరీగా, ఇక వాయిగండ్ల వెంకటసుబ్బారావు, బొమ్మిశెట్టి వీరభద్రబాబు, జిల్లా వెంకటేశ్వర్లు, పల్లపోతు పురుషోత్తం, నూనె సుబ్బారావు, నూనె హరిప్రసాద్‌లు ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ కూరపాటి సత్యనారాయణ మాట్లాడుతూ అధ్యక్షునిగా తనకు మరొకసారి అవకాశం ఇచ్చిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఫాన్సీ గూడ్స్ కళ్యాణ మండపం అభివృద్ధికి, వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 6: ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్‌రూములో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. నిర్వాహకులు ఎస్‌కే.ఖాదర్ ఆధ్వర్యంలో జరిగిన ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాలకు కళాకారులు పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొనసాగిన సంగీత విభావరిలో గాయకులు ఖాదర్, పురాణం సుబ్రహ్మణ్యం, ఆర్.ఏడుకొండలు, గుమ్మడి శ్రీనివాసరావు, అశోక్, శైలజ చిత్ర, శైలజా రాజేష్ తదితరులు పాత కొత్త చిత్రాలలోని పలు గీతాలను రసరమ్యంగా ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. జెర్మియా బృందం వాద్య సహకారాన్ని అందజేయగా, గుర్రం కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సాగుకు గుండ్లకమ్మ నీరు అందించాలి



ప్రాజెక్టు వద్ద రైతు నాయకులు

మద్దిపాడు, అక్టోబరు 6: గుండ్లకమ్మ ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు రైతులకు సైతం నీరు అందించాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. గేట్లు మరమ్మతులు చేపట్టడంతోనే కాకుండా కొత్త గేట్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలుగు టీఎంసీలు నీరు నిల్వచేసే విధంగా చూడాలని, ప్రాజెక్టు రైతు సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు నారిపెద్ది వరహాలచౌదరి, వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, నాయకులు నున్న ప్రసాద్, వడ్డే భూపేష్‌రెడ్డి, ఎస్.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి పూర్తి సహకారం

● ఎమ్మెల్యే దామచర్ల



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న మాజీసైనికులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు 6: మాజీ సైనికుల సంక్షేమ కోసం తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఎయిర్‌ఫోర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సైనికులు నిరంతరంగా దేశ సరిహద్దులలో రక్షణగా కాపలా ఉండటం వల్లే దేశ సంపద, ప్రజలు సురక్షితంగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లాలో సైనికులు అధికంగా ఉండటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. మాజీ సైనికుల నివేశన స్థలాల సమస్య ఎప్పటినుంచో ఉందని, ఇళ్ల స్థలాలు మంజూరుకు తాను ప్రయత్నిస్తానని తెలిపారు. అలాగే ఒంగోలులో అమరజవానుల విజయస్థూపం నిర్మించుకోవటానికి తన వంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పాత రిమ్స్‌లో ఉన్న 40సెంట్లు స్థలంలో మిలటరీకి సంబంధించిన భవనం నిర్మించుకోవాని, అందుకు కావాల్సిన అనుమతులు ఇప్పిస్తానని తెలిపారు. సైనిక బోర్డు డైరెక్టర్, బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి మాట్లాడుతూ సైనికులకు, మాజీ సైనికుల పిల్లలకు రిజర్వేషన్ల పెంపుదలపై ప్రభుత్వంతో మాట్లాడినట్లు చెప్పారు. మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సుల్లో రిజర్వేషన్ సీట్లు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ సౌకర్యాన్ని వినియోగంచుకోవాలని కోరారు. రాష్ట్ర మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ మన దేశంలో వాయుసేన 1932లోనే ఏర్పాటు చేశారని, దేశంలో ఉన్న క్షిపణులు 6వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవని తెలిపారు. కాగా జిల్లాలోని మాజీ సైనికులు విజయవాడ వరద బాధితుల కోసం రూ.1.70లక్షలు వసూలు చేసి చెక్కును ఎమ్మెల్యేకు అదజేశారు. ముందుగా అమరజవానుల విజయస్థూపం వద్ద ఎమ్మెల్యే దామచర్లతో పాటు మాజీ సైనికులు పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి రజనీకుమారి, మాజీ సైనికులు చుండూరి శ్రీరామమూర్తి, పాశం వెంకటరెడ్డి, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు, వైద్యులు ఆనంద్‌యాదవ్, రవీంద్రారెడ్డి, కటారి వాసంతి పాల్గొన్నారు. 70 ఏళ్ల దాటిన మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు.

చీమకుర్తిలో మద్యం షాపులకు యమ గిరాకీ

సర్కిల్ పరిధిలో అర్ధసెంచరీ దాటిన దరఖాస్తులు ● గడువు మరో మూడురోజులు ఉండటంతో ఇంకా పెరిగే చాన్స్



చీమకుర్తి ఎక్సైజ్ కార్యాలయం

చీమకుర్తి, అక్టోబరు 6 : చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు యమ గిరాకీ ఏర్పడింది. నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు, లైసెన్స్ ఫీజులు భారీగా పెంచినా మేం తగ్గేదిలే అన్నట్లు వ్యాపారులు భారీగా పోటీపడుతున్నారు. ఈనెల ఒకటో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయగా మొదటి మూడురోజులు ఒక్క దరఖాస్తు కూడా అందకపోవటంతో ఎక్సైజ్ అధికారులు ఉలిక్కిపడ్డారు. ఇదేమిటబ్బా అని అనుకున్నారు. కానీ గడచిన రెండురోజుల్లోనే అందిన దరఖాస్తుల సంఖ్య 50 దాటటం విశేషం. జిల్లాలోని అన్ని సర్కిల్స్‌లో చీమకుర్తి సర్కిల్ పరిధిలోనే ఇంత వరకు ఎక్కువగా దరఖాస్తులు అందటం మరో విశేషం. సర్కిల్ పరిధిలో చీమకుర్తి మున్సిపాలిటీ, రూరల్ మండలానికి కలిపి 9, సంతనూతలపాడు మండలం 4, మద్దిపాడు మండలం 3 మొత్తం సర్కిల్ పరిధిలో 16షాపులకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఫీజు రూ.2 లక్షలు చెల్లించి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 11న తీసే లాటరీలో ఎంపికైన వారు లైసెన్ ఫీజు కింద షాపునకు రూ.65 లక్షలు అదేరోజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజును షాపు దక్కకపోయినా వెనక్కి ఇవ్వరు. అంటే ఈపాటికే దరఖాస్తు ఫీజు రూపంలో ఇప్పటికే కోటి రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఈనెల 9వతేదీ వరకూ దరఖాస్తుకు అవకాశం ఉండటంతో ఇంకా వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. కాగా 16షాపుల్లో ఒక్క షాపుకు తప్ప అన్ని షాపులకు ఇప్పటికే దరఖాస్తులు దాఖలు అయ్యాయి. మరో వైపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే వారి కోసం చీమకుర్తి పట్టణంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సుకన్య పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు.



అచలానంద ఆశ్రమంలో అమ్మవారు



శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో కళాకారుల నృత్య ప్రదర్శన

వైభవంగా శరన్నవరాత్రులు

లలితా త్రిపురసుందరిగా అమ్మవారి అలంకరణ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బాలాజీరావుపేటలో

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 6: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఒంగోలు నగరంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు ప్రతిరోజు ఒక ప్రత్యేక దేవతా రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావటంతో నగరంలోని ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో దేవాలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనేక ఆలయాలలో బాలా త్రిపుర సుందరి రూపంలో అలంకరణ చేయగా, మరికొన్ని ఆలయాలలో గాయత్రీ దేవి రూపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డు వాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గాదేవి ఆలయం, శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, లాయర్‌పేట శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీకామాక్షి దేవస్థానం, గంటాపాలెం మహాలక్ష్మి దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీపార్వతీదేవి ఆలయం, గద్దలగుంట పాలెం శ్రీనాగార్పమ్మ దేవస్థానం, శ్రీశక్తిపీఠం, మంగమూరు రోడ్డు గాయత్రీ మందిరం, శ్రీఅచలానంద ఆశ్రమం, కొత్తపట్నం బస్టాండు శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం మొదలైన పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

ఇక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పలు దేవాలయాలలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సంతపేట సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన భక్తిసంగీత విభావరిలో టీటీడీ గాయకులు, అన్నమయ్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ పలు అన్నమాచార్య సంకీర్తనలు, అమ్మవారి కీర్తనలతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఆలయ నిర్వాహకులు అళహరి చెంచలరావు మురళీకృష్ణను శాలువాతో సత్కరించారు. అటు స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చందూ డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించి చిన్నారులను అభినందించారు.



కేశవస్వామి పేటలో..



గొడుగుపాలెంలో..



గంటాపాలెంలో..



మహిషాసురమర్దిని గుడిలో అమ్మవారు

అవీ..ఇవీ..

మంత్రిని కలిసిన ఒంగోలు ఆర్డీవో



మంత్రి స్వామికి మొక్కను ఇస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పునాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో ఆదివారం ఆర్డీవో మంత్రి స్వామిని కలిసి మొక్కను అందజేశారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు. అలాగే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆర్డీవో కలిసి మొక్కను అందజేశారు.

ప్రశాంతంగా టెట్

ఒంగోలు(విద్య), అక్టోబరు 6: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్) నాల్గవ రోజైన ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మూడింటిలో మాత్రమే పరీక్ష నిర్వహించారు. ఒంగోలులోని ఎన్‌సీఎస్ఐ, బ్రిలియంట్ పరీక్షా కేంద్రాలు, మార్కాపురంలోని శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరిగింది. పరీక్షలకు రెండు సెషన్లలో 935 మంది అభ్యర్థులను కేటాయించగా 756 మంది హాజరు కాగా 177 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 465 మందికి 96 మంది గైర్హాజరు కాగా మధ్యాహ్నం సెషన్‌కు 470 మంది అభ్యర్థులను కేటాయించగా 81 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వపరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు.

అక్రమ కట్టడాలకు హెచ్చరిక బోర్డులు



నిర్మాణానికి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సిబ్బంది

నాగులుప్పలపాడు అక్టోబరు 6: ఉప్పుగుండూరులోని ప్రభుత్వ కుంట స్థలం పరిధిలోని అక్రమ నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలోని చీరాల రోడ్డులోనున్న మాలకుంట స్థలంలో గత కొద్ది రోజుల నుంచి స్థానికులు కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పలువురు గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న వారిని రెవెన్యూ అధికారులు హెచ్చరించి ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకూడదని, తక్షణమే నిలిపివేయాలని సూచించారు. అధికారుల ఆదేశాలను పట్టించుకోలేదు. ఆక్రమణదారులు నిర్మాణాలు కొనసాగించడంతో ఆదివారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది మాలకుంట స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలకు హెచ్చరిక ఫెక్సీలను ఏర్పాటు చేశారు.

రివ్యూ పిటిషన్ల తిరస్కరణ అన్యాయం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6 : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను తిరస్కరించడం రాజ్యాంగ వ్యతిరేకమని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు ఆరోపించారు. ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ సేవా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏడుగురు ధర్మాసనం వాదనలు విన్నప్పుడు తొమ్మిది మంది ధర్మాసనంకు విజ్ఞప్తి చేసుకోవాలని సూచలనకు రివ్యూ పిటిషన్లను ఏ విధంగా తిరస్కరిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్నాశి చిరంజీవి, సంపత్‌కుమార్, ఎరిచర్ల సుబ్రహ్మణ్యం, అంగలకుర్తి సుబ్బారావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: ఒంగోలు లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కారవేదిక హాలులో జరిగే స్వర్ణాంధ్ర-2047 జిల్లాస్థాయి విజన్ సంప్రదింపులు, సలహాల సమావేశానికి హాజరవుతారు. అనంతరం నగరంలో జరిగే కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

కర్ణాటకలో జరిగే సదస్సుకు వెళ్లిన కమిషనర్

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 6: రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలలో అభివృద్ధి, ఇతర అంశాలు ఉత్తమ ఫలితాల సాధన కోసం ఒంగోలు నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలో నాలుగు రోజుల పాటు జరిగే సదస్సులలో పాల్గొననున్నారు. ఈ సదస్సులో పన్నులు వసూలు విధానం, ప్రజాసమస్యలు త్వరితగతిన పరిష్కారం పద్ధతులు, మెరుగైన తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, తదితర అంశాలపై ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు అధ్యయనం చేయనున్నారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలలో అధ్యయనం కోసం నాలుగు బృందాలు హాజరు కానున్నారు. అనంతరం అక్కడి అంశాలపై రాష్ట్ర పురపాలకశాఖకు అందించనున్నారు. తిరిగి 11వ తేదీన కమిషనర్ యథావిధిగా విధులకు హాజరవుతారు.

కరవది-ఉలిచి రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు

● ఇబ్బందిపడుతున్న వాహనదారులు



రోడ్డు వెంబడి ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

ఒంగోలు(రూరల్), అక్టోబరు 6: ఒంగోలు మండలంలోని కరవది-ఉలిచి రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు ఈ మార్గంలో కరవది నుంచి గుండాయపాలెం వరకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డులో ఏడు మలుపులు ఉన్నాయి. ఇక యర్రమట్టి రేవు సమీపంలో, ఉలిచి, దేవరంపాడు మధ్య గొబ్బికుంట దగ్గర ప్రమాదకరమైన మలుపులు ఉండగా ఈ ప్రాంతాల్లో చిల్లచెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు వెంట ఉన్న చిల్లచెట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


టీడీపీ నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, అక్టోబరు 6: మండలంలోని పి.గుడిపాడులో టీడీపీ నాయకుడు పసుపులేటి మోహన్ నాయనమ్మ సుబ్బులు సమారాధనకు ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.సురేష్, ఎస్.మాధవీలత, చౌదరి, అపర్ణ, పోతురాజు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నాగులుప్పలపాడు అక్టోబరు 6 : హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఏ ఎం.మల్లేశ్వరి సూచించారు. బాపట జిల్లా ఎయిడ్స్ నిర్మూలన నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బి.నిడమానూరు గ్రామంలో ఆదివారం మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఆ వ్యాధి బారిన పడితే ప్రభుత్వ ఐసీటీసీ కేంద్రాలను సందర్శించి మందులు, వైద్య సలహాలను పొందాలన్నారు. అవగాహన పెంచుకొని హెచ్ఐవీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. జాతీయ టోల్‌ఫ్రీ నంబరు 1097పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణవేణి, దివ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

మద్దిపాడు, అక్టోబరు 6: లింగంగుంట గ్రామంలో ఆదివారం చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ మన్నం కృష్ణకిషోర్‌చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎంవీ.కృష్ణ చైతన్య, డాక్టర్ బి.నాగమాధురి, టీడీపీ నాయకులు మన్నం రాజా, మన్నం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దబ్బాయి

గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ శిక్షణ తరగతులకు జిల్లా కార్యదర్శి తోట తిరుపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెద్దబ్బాయి మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారులను ఏ ప్రభుత్వం వచ్చినా చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. అందువల్లనే అనేక సంవత్సరాలుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత ఏడు నెలల నుంచి పశువుల హాస్పటల్స్‌కు మందులు రావడం లేదని చెప్పారు. దీంతో పశువుల రైతులు, గొర్రెల పెంపకందారులు ప్రైవేటు షాపుల్లో లక్షలాది రూపాయాలు పెట్టి మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. వివిధ రకాల జబ్బులు, యాక్సిడెంట్లు, పిడుగుపాటుకు వేలాది జీవాలు మరణించిన సందర్భాలు అనేకం ఉన్నా నష్టపరిహారం అందడం లేదని తెలిపారు. గొర్రెల షెడ్లు 90శాతం సబ్సిడీతో అర్హత ఉన్న వారందరికి నిర్మించాలని, 50శాతం సబ్సిడీతో పెంపకం దారులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల రుణం ఇవ్వాలన్నారు. 50 ఏళ్లకే పింఛను సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్, మద్దిబోయిన శేషు, కందరాజు జయరాం, కండే బాలకృష్ణ, జనార్దన్, బుర్రా శ్రీరాములు, బత్తుల అంకమ్మరావు, బొడ్డు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా వల్లూరమ్మ



శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో వల్లూరమ్మ

టంగుటూరు, అక్టోబరు 6 : మండలంలోని వల్లూరులో వేంచేసిఉన్న వల్లూరమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాల్గోరోజైన ఆదివారం శుద్ధ చవితినాడు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో వల్లూరమ్మ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. దేవస్థానంలో పరిస్థితులను దేవస్థానం కార్యనిర్వహణాధికారి బీ రమేష్ పర్యవేక్షించారు.

పదవీ స్వీకరణ మహోత్సవానికి వచ్చినవారికి కృతజ్ఞతలు

టంగుటూరు, అక్టోబరు 6 :ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకరణ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన ప్రతి ఒక్కరికీ దామచర్ల సత్యనారాయణ(సత్య) కృతజ్ఞతలు తెలిపారు. మనస్ఫూర్తిగా తనను ఆశీర్వదించిన వివిధ శాఖల మంత్రులు, పలువురు శాసనసభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లకు, రాష్ట్ర పార్టీ నాయకులకు, ప్రధానంగా తనను అమితంగా ప్రేమించే కొండపి నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పుకున్నారు.



వెంకటేశ్వర్లుకు సొమ్మును తిరిగి అప్పగిస్తున్న ఎస్సై

పోగొట్టుకున్న సొమ్ము బాధితుడికి అందజేత

టంగుటూరు, అక్టోబరు 6 : పోగొట్టుకున్న సొమ్ము తిరిగి బాధితుడి చేతికి చేరిన సంఘటన ఆదివారం టంగుటూరులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.. సంతనూతలపాడు మండలం గొర్లమిట్టకు చెందిన వృద్ధుడు మద్దినేని వెంకటేశ్వర్లు ఆదివారం జమ్ములపాలెంలోని తన కుమార్తె వద్దకు వచ్చాడు. వెంకటేశ్వర్లు తన సంచిలో రూ.85వేలతోపాటు ఒక వెండి గొలుసు ఉన్నాయి. ఉదయం 10గంటల సమయంలో కుమార్తె ఇంటి నుంచి తిరిగి ఆటోలో సొంతూరు వెళ్లేందుకు టంగుటూరు చేరుకున్నాడు. అక్కడ సంచిని చూడగా ఖాళీగా ఉంది. వెంటనే హడావుడిగా టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ వెంకట్రావు అప్రమత్తమై బస్టాండ్ సెంటర్‌కు వచ్చి విచారణ చేశారు. అతను ఆటో ఎక్కిన జమ్ములపాలెం కూడా వెళ్లి వాకబు చేశాడు. వెంకటేశ్వర్లు ఆటో ఎక్కిన చోటే డబ్బు పడిపోవడంతో ఒకరికి దొరికింది. ఆ సొమ్మును కానిస్టేబుల్ రికవరీ చేశాడు. దొరికిన సొమ్ము ఎస్సై నాగమల్లీశ్వరరావు సమక్షంలో వెంకటేశ్వర్లుకు అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్‌ను ఎస్సై అభినందించారు.

జూదరులపై పోలీసుల దాడి

మండలంలోని సూరారెడ్డిపాలెం శివారులోని డంపింగ్‌యార్డులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఏడుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.6,240 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్లూరు జడ్పీటీసీ బలవన్మరణం

● పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి

● కుటుంబ తగాదాలే కారణం



బాపిరెడ్డి (ఫైల్)

గుడ్లూరు, అక్టోబరు 6: కుటుంబ తగాదాలతో పురుగులమందు తాగి నెల్లూరు జిల్లా గుడ్లూరు జడ్పీటీసీ కొరిశపాటి బాపిరెడ్డి(48) బలవన్మరణానికి పాల్పడ్డారు. బంధువుల కథనం మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలిచి ఆయన గుడ్లూరు జడ్పీటీసీగా గెలుపొందారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన బాపిరెడ్డి నాలుగురోజుల క్రితం కావలిలోని తన నివాసంలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృదుస్వభావిగా పేరుగాంచిన బాపిరెడ్డి మృతిపై గుడ్లూరు మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన స్వగ్రామం గుండ్లపాలెంలో సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి. బాపిరెడ్డి స్వగ్రామం గుడ్లూరు మండలం గుండ్లపాలెం కాగా, కొంతకాలంగా కావలిలో నివాసం ఉంటున్నారు.

గ్రీవెన్స్‌హాల్ వద్ద దుర్గంధం

● మురుగునీరు బయటకు పోయే దారిలేదు..

● ఇబ్బందిపడుతున్న ఉద్యోగులు, ప్రజలు





కలెక్టరేట్ ప్రాంగణంలో పేరుకున్న మురుగు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: అక్కడ అధికారులు..ఉద్యోగులు నిరంతరం తిరుగుతూ ఉంటారు. మురుగునీరు పేరుకొని పోయి దుర్గంధం వెదజలుతున్నా ఎవరూ పట్టించుకోరు. అక్కడ ఆ మురుగునీటి కారణంగా దోమలు ఉత్పత్తి అవుతున్నా అవేమి తెలియనట్లుగా ఉంటున్నారే తప్ప పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. ఇదీ ఎక్కడో కాదు.. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోనే. కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాల్లోని మురుగునీరు బయటకు పోయేందుకు వీలు లేక గ్రీవెన్స్‌హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు పెరిగి ఇబ్బందిగా మారింది. అయితే సంబంధిత కార్యాలయ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. మురుగునీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు ఏర్పాట్లు చేసేందుకు అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అక్కడ చెట్లు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజానీకం, ప్రజాప్రతినిధులతో జరిగే సమావేశాల సమయంలో వారి వెంటనే వచ్చే వారు ఆ చెట్ల కిందనే సేదతీరుతుంటారు. అటువంటి చోట ఇటువంటి అపరిశుభ్ర వాతావరణం ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



దొంగలు తొలిగించిన గ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు హజరత్తయ్య, రంగనాథ్, ఎస్సై మహేంద్ర

మూలగుంటపాడులో భారీ చోరీ

● 47 సవర్ల బంగారం, 11 కేజీల వెండి, రూ.3లక్షల నగదు అపహరణ ● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సింగరాయకొండ, అక్టోబరు 6 : మండలంలోని మూలగుంటపాడులో భారీ చోరీకి గుర్తు తెలియని దుండగులు పాల్పడ్డారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో లోపలికి ప్రవేశించి 47 సవర్ల బంగారాన్ని, 11 కేజీల వెండి, రూ. 3 లక్షల నగదును అపహరణ చేశారు. వివరాలలోకి వెళ్తే.. మూలగుంటపాడు హెచ్‌పీగ్యాస్ కంపెనీ సమీపంలోని పొత్తూరి ఎల్ఐసీ ఏజెంట్ శ్రీరామమూర్తి తన మామ నెల్లూరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఈ నెల 1న అక్కడికి వెళ్లారు. ఆదివారం శ్రీరామమూర్తి ఒక్కరే మూలగుంటపాడు వచ్చాడు. ఇంటిలోపలికి వెళ్లగా బెడ్‌రూమ్‌లో కప్‌బోర్డ్ తెరిచి ఉన్నాయి. వస్తువులు, బ్యాగులు చిందరవందరగా మంచంమీద పడవేసి ఉన్నాయి. వంటగదిలోకి వెళ్లి చూడగా దక్షిణం వైపు ఉన్న కిటికి గ్రిల్ తొలగించి కిందపడేసి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బి. మహేంద్ర ఇంటిని పరిశీలించారు. ఆ తరువాత ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ హజరత్తయ్య, సీసీఎస్ సీఐ దాచేపల్లి రంగనాథ్ వచ్చారు. చోరీ చేసిన ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే క్లూస్‌టీంను, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై బి. మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులు అధ్వానం

● ప్రయాణికుల ఇక్కట్లు





అధ్వానంగా ఉన్న చీమకుర్తి-నాయుడు పాలెం రహదారి (ఇన్‌సెట్లో) గుంతలతో నిండిన రామతీర్థం ఆలయానికి వెళ్లే రోడ్డు

చీమకుర్తి, అక్టోబరు 6: చీమకుర్తి మండల పరిధిలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయమై వాహనదారులకు నరకప్రాయంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవటంతో రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. గుంతల్లో వర్షపునీరు చేరటంతో రహదారులు ప్రమాదభరితంగా మారాయి. చీమకుర్తి నుంచి పి.నాయుడుపాలెం వెళ్లే బీటీరోడ్ గుంతలమయంగా మారింది. అదేవిధంగా రామతీర్థం జంక్షన్ నుంచి మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయం వెళ్లే రహదారి దుస్థితికి చేరి రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇక చీమలమర్రి నుంచి మంచికలపాడుకు, నేకునంబాదు నుంచి దొడ్డవరనకు వెళ్లే రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయమై రహదారులకు మరమ్మతులు నిర్వహించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, అక్టోబరు 6 : రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన ఓ యువకుడిని తనకు అందిన ముందస్తు సమాచారం ప్రకారం సింగరాయకొండ సీఐ హజరత్తయ్య కాపాడారు. వివరాలోనికి వెళ్తే.. పశ్చిమబెంగాల్‌కి చెందిన షేక్ షబ్బీర్ తన తల్లిదండ్రులతో కలిసి కందుకూరు జనార్దన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. పరిసర ప్రాంతాల్లో పాలీషింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. షబ్బీర్ నాలుగేళ్ల నుంచి హైదరాబాద్‌కు చెందిన ఒక యువతిని ప్రేమంచి ఆమెతో కలిసి కందుకూరులో ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం ఇరువురు మధ్య మనస్పర్థలు రావడంతో ఆ యువతి షబ్బీర్ వద్ద నుంచి వెళ్లిపోయింది. ప్రియురాలు విడిచి వెళ్లడంతో మనస్తాపం చెంది షబ్బీర్ ఆత్మహత్య చేసుకోవడానికి కందుకూరు నుంచి బైక్‌పై సింగరాయకొండ వచ్చాడు. ఆత్మహత్య చేసుకోవడానికి సోమరాజుపల్లి గేటు వద్దకూ చేరుకున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు సీఐ హజరత్తయ్యకు సమాచారం అందించారు. సీఐ తనతోపాటు హోంగార్డు సురేష్‌తో రైల్వేగేటు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న షబ్బీర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వెంటనే సీఐ తన కార్యాలయానికి తీసుకొని వెళ్లి షబ్బీర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు సీఐ హజరత్తయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



వాడరేవు సముద్ర తీరంలో పర్యాటకులు

తీరంలో పర్యాటకుల సందడి

చీరాల, అక్టోబరు 6 : ఇటీవల కాలంలో వీకెండ్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి సామాన్య ప్రజల వరకు ఆటవిడుపుగా తీరప్రాంతాలకు కుటుంబ సమేతంగా వస్తున్నారు. స్నేహితులతో వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. శని, ఆది వారాల్లో తీరప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. చీరాల మండలం వాడరేవు, వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, చినగంజాం మండలం మోటుపల్లికి పర్యాటకులు వస్తుంటారు. అయితే కొన్ని చోట్ల పర్యాటకులకు సముద్రస్నానాలు చేసిన అనంతరం దుస్తులను మార్చుకునేందుకు ప్రత్యేక వసతులు లేవు. ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

దిగువ ఆయకట్టుకూ నీరివ్వాలి

● మంత్రి గొట్టిపాటి ఆదేశం



ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 6 : అధికారులు సమన్వయంతో పనిచేసి దిగువ ఆయకట్టుకూ నీటి విడుదల అయ్యేలా పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఏబీసీ 18వ మైలు వద్ద ఆదివారం నీటి విడుదలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు మేజర్ కాలువలలో చిల్లచెట్లు, పూడికతో నిండిపోయి నీటి ప్రవాహం లేకుండా పోయిందని మంత్రి రవికుమార్‌కు వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి ఆయా పరిధిలోని అధికారులు అన్ని మేజర్లను పరిశీలించి అవసరమైన అన్నిచోట్లా ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసి వారం రోజులలో పూడిక తీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్చూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలతో పాటు అద్దంకి నియోజకవర్గంలోని దిగువ ఆయకట్టుకు కూడా నీటి విడుదల జరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏబీసీ హెడ్ వద్ద 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించడంతో పాటు బాపట్ల జిల్లా సరిహద్దు 18వ మైలు వద్ద 1,200 క్యూసెక్కులు విడుదలయ్యేలా దిగువ ఆయకట్టుకు సరిపడా నీటి విడుదలకు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల ఏర్పాటు పనుల గురించి ఈఈ అబుతలేమ్‌తో చర్చించారు. ఇప్పటికే 10 గేట్ల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన రెండు గేట్ల పనులు పూర్తవుతాయని ఈఈ వివరించారు. లింగంగుంట్ల మానిటరింగ్ ఈఈ మల్లికార్జున, సంతగుడిపాడు, సంతమాగులూరు, అద్దంకి డీఈలు రామారావు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఏఈలు వేణు, అనిల్, ప్రతిమ, విశ్వమోహన్, క్రాంతి, సునీల్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: విశ్వబ్రాహ్మణ సంఘం నగర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జిల్లా కన్వీనర్ మంచా బాబు ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. నగర అధ్యక్షుడిగా మానేపల్లి గోవిందాచారి, ప్రధానకార్యదర్శిగా కందుకూరు దక్షిణామూర్తి, కోశాధికారిగా కొత్తపల్లి సాయి, గౌరవాధ్యక్షులుగా పోతులూరి శివబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలిచేటి నాగబ్రహ్మం, ఉపాధ్యక్షులుగా చాలా కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సీనియర్ నాయకులు పోతకమూరి బాలసుబ్రహ్మణ్యం, చోడ శ్రీనివాసరావు, గోనుగుంట బ్రహ్మానందశర్మ, బ్రహ్మయ్య సిద్ధాంతి చోడ సుందరాచారి, నూతలపాడుప్రసాద్, సత్తెనపల్లి వెంకటేష్, చోడ పాండురంగాచారి తదితరులు అభినందించారు.

రైజ్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ఒంగోలు(విద్య), అక్టోబరు 6: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూపు కళాశాలల్లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పలు రకాల సంగీత వాయిద్యాలతో చేసిన సంగీత కార్యక్రమం(రైజ్ రిథమ్) అందరినీ ఆకట్టుకుంది. చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు

● ఒకే రోజు అన్నికేంద్రాల్లో ప్రారంభం

● 105 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా

దక్షిణాది రీజియన్లలో రెండు రోజుల్లో ముగియనున్న మార్కెట్



ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ప్రస్తుత సీజన్ (2024-25) పొగాకు కొనుగోళ్లు సోమవారం నుంచి మొదలుకానున్నాయి. అక్కడ మొత్తం పది వేలం కేంద్రాలు ఉండగా అన్ని చోట్లా ఒకేరోజున ప్రారంభిస్తున్నారు. గత రెండేళ్లు కర్ణాటకలో ఇచ్చిన అనుమతికన్నా పంట ఉత్పత్తి తగ్గింది. 2022-23లో 100 మిలియన్ కిలోలకు 60మిలియన్ కిలోలు మాత్రమే ఉత్పత్తి అయింది. 2023-24లో కూడా వంద మిలియన్ కిలోలకు అనుమతివ్వగా 80 మిలియన్ కిలోలు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లోనూ 100 మిలియన్ కిలోలకే పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 105 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా వేస్తున్నారు. అంటే గత ఏడాది కన్నా సుమారు 25 మిలియన్ కిలోలు అంతకు ముందు ఏడాది కన్నా 45 మిలియన్ కిలోలు అధికమైనట్లు సమాచారం. కాగా గతం కన్నా పంట ఉత్పత్తి కొంత పెరగడంతోపాటు నాణ్యత అంతగా లేదని తెలుస్తోంది. దాని ప్రభావం ధరలపై చూపే అవకాశం ఉంది. గత ఏడాది తొలి రోజున కిలో గరిష్ఠ ధర రూ.240తో ప్రారంభించిన వ్యాపారులు క్రమంగా పెంచుతూ కిలోకు రూ.292 ఇచ్చారు. అలాగే అత్యల్ప ధర కిలో రూ.200 పలికింది. సగటున కిలోకు రూ.259.22 ధర లభించింది. ఈసారి ప్రారంభ ధరను అక్కడి రైతులు కిలోకు రూ.275 కోరుతున్నట్లు తెలుస్తుండగా వ్యాపారులు రూ.250తో ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా రాష్ట్రంలో దక్షిణాది రీజియన్లలో పొగాకు మార్కెట్ మరో రెండు, మూడు రోజుల్లో ముగియనుంది. ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్లలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11వేలం కేంద్రాలు ఉండగా ఇప్పటికే ఎనిమిది చోట్ల కొనుగోళ్లు ముగిశాయి. సోమవారం రెండింటిలో, బుధవారం మరో రెండింటిలో పూర్తికానున్నాయి.

ఇనగలేరుపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

టంగుటూరు, అక్టోబరు 6 : పొందూరు-కొణిజేడు గ్రామాల మధ్య ఇనగలేరుపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి మోజెస్ డిమాండ్ చేశారు. అలాగే పొందూరు-ఎం నిడమలూరు మధ్య మంగలివాగుపైనా బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు. పొందూరు గ్రామ సీపీఎం 15వ మహాసభ వేజండ్ల హనుమంతరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత పరిటాల కోటయ్య స్థూపం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు టీ రాము, వేజండ్ల సింగయ్య, వేజండ్ల వెంకటరత్నం, ముప్పరాజు రమేష్, పాపినేని వెంకటేశ్వర్లు, వేజండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పొందూరు సీపీఎం కార్యదర్శిగా సింగయ్య

పొందూరు గ్రామ శాఖ సీపీఎం కార్యదర్శిగా వేజండ్ల సింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ మహాసభ సందర్భంగా ఈఎన్నిక జరిగింది.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో 'మీకోసం'

సింగరాయకొండ, అక్టోబరు 6 : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొననున్నారు. అనంతరం ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి ఒక ప్రకటనలో కోరారు.

దసరా శుభాకాంక్షలతో... ఆఫర్.. ఆఫర్...
ఒంగోలు నగర పరిసర ప్రాంతముల వారికి
బాంబేటెక్స్ వారి శుభవార్త
SHOP NO. 134 & 135, శ్రీ బాపూజి మార్కెట్ కాంప్లెక్స్, ONGOLE.
Raymond Phant Rs.500/-
BSL Phant Rs.500/-
Cotton Shirt 1.60Cut Rs.300/-
Phant+Shirt Rs.800/-
పైన తెలిపిన ఆఫర్లను వినియోగించుకొని ఎప్పటివలె మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడగలరు
BOMBAYTEX
GENTS CLOTH & CUT PIECES SHOW ROOM
SHOP NO. 134 & 135, S.B.M.C. ONGOLE.
PROP:- K.V. SUBBA RAO, CELL:- 9966003542

AJC ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

FLAT FOR SALE
■ 2 BHK, 1278 SFT, 502, ANJANEYA ENCLAVE, BHAGYA NAGAR, 4th Lane, Opp. Andhra Pragati Grameen Bank, Ongole - 523001, Contact - P. Radha Krishna, 9373282002 / 8999790130.
AJO-190375

జ్యోతిష్యాలయం
■ ఆదిశక్తి రేణుక యల్లమ్మ తల్లి జ్యోతిష్యము చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, సంతానం, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఏ సమస్యకైన పరిష్కారం చెప్పబడును. సంప్రః G.కృష్ణంరాజు, R.T.C.బస్టాండు దగ్గర, ఒంగోలు, సెల్: 9640409458
AJO-200161

ప్లాట్లు అమ్మబడును
■ ఒంగోలు కార్పోరేషన్ లిమిట్స్‌లో అన్ని వసతులతో ఓపెన్ ప్లాట్స్ మరియు DTCP అప్రూవడ్ ప్లాట్లు కలవు. KR డెవలపర్స్. సెల్ : 8499816663.
AJO-200074

WANTED
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k. Ph:9640258899, 9640468899
AJH-15274

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు
వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు
లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.
ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484

శోభాయమానంగా అలంకరణలు

- శ్రీకూష్మాండ దుర్గాదేవిగా బాలాత్రిపురసుందరీదేవి
- మార్కాపురంలో ధనలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు
- పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

త్రిపురాంతకం, అక్టోబరు 6: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బాలాత్రిపుర అమ్మవారు శ్రీకూష్మాండదుర్గాదేవి అలంకారంలో శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు నాగఫణిశాస్త్రి, ఫణీంద్రకుమార్‌శర్మ, అర్చకులు ప్రసాద్‌శర్మ, విశ్వన్నారాయణశాస్త్రి అమ్మవారికి అభిషేకాలు, ప్రాతఃకాలపూజ, బాలబోగం, ఉభయదాతలతో కుంకుమార్చనలు నిర్వహించారు. అలంకార పూజ అనంతరం రాత్రికి అమ్మవారికి శేషవాహనంపై ఆలయ ఉత్సవం నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, పరాకులు, పవళింపుసేవ నిర్వహించారు. అమ్మవారు సోమవారం స్కందమాతదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


కూష్మాండ దుర్గాదేవిగా బాలాత్రిపురసుందరి అమ్మవారు

శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో

బేస్తవారపేట : బేస్తవారపేట శ్రీవాసవీ కన్యాక పరమేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొంతల లక్ష్మణ్‌స్వామిగుప్త, అధ్యక్షులు జక్కా కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. బేస్తవారపేటలో శ్రీలంకాలమ్మ దేవాలయంలో నక్కా రామచంద్రయ్య కుటింబికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అన్నపూర్ణాదేవి అలంకరణ

గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం

కంభం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కంభంలోని కోటా సత్యమాంబదేవి గజలక్ష్మీదేవి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. అలాగే అమ్మవారి శాలలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారు ఆదివారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


రామావతారంలో వేంకటేశ్వరుడు

అన్నపూర్ణాదేవి అలంకారం


అన్నపూర్ణాదేవిగా వాసవీమాత

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా గిద్దలూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు తెచ్చిన సుమారు 100 రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. ముత్తైదువులతో ప్రధాన వీధుల నుంచి కలశాలను తెచ్చే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. శర్మవీధిలోని జువ్విళ్ళబావి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాలమ్మ, సాయిబాబా, కనకదుర్గ, కాళికాంబ దేవాలయా లలో వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముండ్లపాడు, కే.ఎస్.పల్లి, పొదల కొండపల్లిలో సామూహిక పూజలు నిర్వహించారు. షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం లో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారు వరాహవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

మార్కాపురం వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రులు మార్కాపురం పట్టణంలో వైభవంగా భక్తజన రంజకంగా నిర్వహిస్తున్నారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు ధాన్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. శివాలయంలో జగదాంబ కూష్మాండ దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. వాసవి కాన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్న పూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి సూరె వెంకట సుబ్బారావు, కోశాధికారి రావండుగు వెంకట రమేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


ధాన్యలక్ష్మిగా రాజ్యలక్ష్మీ అమ్మవారు


అన్నపూర్ణాదేవిగా వాసవిమాత

గాయత్రీదేవిగా అమ్మవారు

పెద్దదోర్నాల : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శ్రీ గాయత్రీదేవి అలంకారంలో, మొట్ల మల్లికార్జున స్వామి దేవాలయంలో, తిమ్మాపురం చౌడేశ్వరీ దేవాలయంలో, కటకానిపల్లె ఆలయంలో అన్నపూర్ణా దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.


గాయత్రీమాత అలంకరణ

లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

కొమరోలు, అక్టోబరు 6: కొమరోలు వాసవీకన్యాకా పరమేశ్వరీ అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కొమరోలుకు చెందిన సవరం ద్రాల బ్రహ్మయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులతో అమ్మవారికి పట్టుచీరను బహూకరించారు. అమ్మవారికి రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.500 నోట్లతో రూ.2.5లక్షల రూపాయల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారి గౌరిపెద్ది హరిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సాయంత్రం చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారిని గరుడవాహనం ద్వారా భక్తులకు గ్రామంలో దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

విద్యుదాఘాతంతో ఎడ్లజత మృతి

మార్కాపురం రూరల్ అక్టోబర్ 6 : విద్యుదాఘాతంలో ఎడ్లజత మృతిచెందిన ఘటన మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన బొమ్మనయిన కాశయ్యకు చెందిన ఎడ్లు మేతకోసం పొలానికి వెళ్లాయి. ఎద్దులు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌పార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగను తాకాయి. మృతి చెందిన ఎడ్ల జత విలువ సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. సంబంధిత అధికారులు విచారించి ఆదుకోవాని కోరుతున్నారు.


మృతిచెందిన ఎడ్లజత

కంభంలో చోరీ

- 6 తులాల బంగారు, రూ.10వేల నగదు అపహరణ

కంభం, అక్టోబరు 6 : పట్టణంలో తాళం వేసిన ఓ ఇంటిలో దొంగలు పడి 6 తులాల బంగారం, రూ.10 వేల నగదు అపహరించిన ఘటన శనివారం రాత్రి వెలుగుచూసింది. కంభం ఎస్సై నరసింహారావు కథనం మేరకు, గణేష్‌నగర్‌లో దయానా అనే మహిళ పిల్లలతో కలిసి నివసిస్తోంది. భర్త యశ్వంత్‌పూర్‌లో రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. దయానా ఐదు రోజులక్రితం ఇంటికి తాళం వేసి గిద్దలూరులోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. శనివారం రాత్రి తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. దీంతో బీరువాను పగులగొట్టి వస్తువులు చిందరవందర వేసిన దృశ్యం చేసిన దయానా దొంగలు పడ్డారని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఒంగోలు క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దొంగలు పగలగొట్టిన బీరువా

మాజీ సర్పంచ్‌పై దారికాచి దాడి

పొదిలి, అక్టోబరు 6 :మండలంలోని మాదిరెడ్డిపాలెం గ్రామంలోని మాజీ సర్పంచ్ పెమ్మని ఓంకార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. ఈ ఘటన పొదిలి పట్టణంలోని బ్యాంకు కాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఓంకార్ పట్టణంలోని బ్యాంకుకాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో పట్టణంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఓంకార్ ద్విచక్ర వాహనానికి అడ్డుగా వచ్చారు. ఒక్కసారిగా కర్రలు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఓంకార్ మృతిచెందాడని భావించిన దుండగులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆ తరువాత రక్తగాయాలతో పడి ఉన్న ఓంకార్‌ను స్థానికులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆయన్ను కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. ఓంకార్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. కాగా ఓంకార్ చేస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో గిట్టనివారే ఈ దాడిచేసి ఉంటారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.


తీవ్రంగా గాయపడిన ఓంకార్

మూడు ఇసుక వాహనాలపై కేసులు

మార్కాపురం, అక్టోబరు 6: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలపై కేసులు నమోదు చేసి రెండు సీజ్ చేసినట్లు మార్కాపురం మైనింగ్ ఏడీ ఎం.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నంద్యాల జిల్లా ఆత్మకూరు వెళ్తున్న ఓ ఇసుక లారీని, ట్రాక్టర్లను పట్టణంలో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెళ్తున్న లారీ, ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. అదేవిధంగా కొనకనమిట్ల మండలం చినారికట్ల సమీపంలో టైర్ పంక్చర్ అయి రోడ్డు పక్కన నిలిపివున్న ఓ లారీలో ఇసుక ఉన్నట్లు గమనించి తనిఖీ చేశామన్నారు. ఓవర్‌లోడ్ ఉన్నందున కేసు నమోదు చేసి రూ.25 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

సజావుగా టెట్

ఒంగోలు(విద్య), అక్టోబరు 6: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్) నాల్గవ రోజైన ఆదివారం సజావుగా జరిగింది. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రా ల్లో మూడింటిలో మాత్రమే పరీక్ష నిర్వహించారు. ఒంగోలులోని ఎన్‌సీసీఎస్‌ఐ, బ్రిలియంట్ పరీక్షా కేంద్రాలు, మార్కాపురంలోని శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరిగింది. పరీక్షలకు రెండు సెషన్లలో 935 మంది అభ్యర్థులను కేటాయించగా 756 మంది హాజరు కాగా 177 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 465 మందికి 96 మంది గైర్హాజరు కాగా మధ్యాహ్నం సెషన్‌కు 470 మంది అభ్యర్థులను కేటాయించగా 81 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వపరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు.

నెట్‌సెంటర్‌లో నకిలీ ధ్రువపత్రాలు

- పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌తో అక్రమాలు
- ఓ వలంటీర్ స్వయం ఉపాధి మార్గం
- గుట్టుగా విచారిస్తున్న అధికారులు

కొనకనమిట్ల, అక్టోబరు 6 : నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసి ప్రభుత్వాన్ని ప్రజలను మోసం చేస్తున్న ఓ నెట్‌సెంటర్ నిర్వాహకుడిపై అధికారులు విచారిస్తున్నారు. గతంలో వలంటీర్‌గా పనిచేసిన సదరు నిర్వాహకుడు పంచాయతీ కార్యర్శుల లాగిన్‌తో, కంప్యూటర్‌లో ఎడిటింగ్‌తో నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు నెట్‌సెంటర్ నిర్వాహకుడిపై ఇటు పోలీసులు, అటు అధికారులు విచారిస్తున్నారు.

మండలంలోని గొట్లగట్టు గ్రామానికి చెందిన ఓ వలంటీర్ నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గతంలో తాను వలంటీర్‌గా ఉన్న పరిచయాలతో అటు అధికారులకు ఇటు ప్రజలకు చేరవయ్యాడు. వివిధ ధ్రువీకరణ పత్రాలను నకిలీవి తయారు చేయడంలో ఆరితేరాడు. జనన, మరణ ధ్రువీకరణపత్రాలు, తహసీల్దార్ డిజిటల్ సిగ్నేచర్‌ను కాపీ చేసి, 1బీ, అండగల్, సదరన్ సర్టిఫికెట్లు తదితరాలు తయారు చేసి నాలుగేళ్లగా విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనిపై అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులకు సమాచారం అందడంతో వారు విచారణ చేయిస్తున్నట్లు తెలిసింది. వీటి తయారీకి పలువురు ప్రభుత్వ ఉద్యోగుల లాగిన్ ఐడీలు వినియోగించినట్లు సమాచారం.

వర్షాలకు దెబ్బతిన్న మిరప


నేలవాలిన మిరపమొక్కలు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు) అక్టోబరు 6: ఎర్రగొండపాలెం మండలం వీరాయపాలెంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఆ వర్షం దాటికి సాగులో వున్న మిరప, పత్తికి నష్టం కలిగింది. వీరాయపాలెంలో ఈ ఏడాది రైతులు ఎక్కువగా మిరప సాగు చేశారు. భారీ వర్షం కురవడంతో సాగులో వున్న పైర్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మిరప మొక్క దశలో పెరుగుతుండడంతో మొక్కలు నెలకు ఒరిగాయి. సూమారు 50 ఎకరాలకు పైగా మిరప తోటలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. సాగులో ఉన్న పత్తి కాపు దశలో ఉండటంతో కొంత నష్టం కలిగించింది. మెట్ట పైర్లయినా కంది, పండ్ల తోటలకు ఈ వర్షం జీవం పోసింది. వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే పడిపోయిన మొక్కలను పరిశీలించి పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


పత్తి చేలో నిలిచిన వర్షపునీరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, అక్టోబరు 6: దసరా సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో పేకాట శిబిరాలపై దాడులు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించేదిలేదన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఇష్టారీతిన యాప్‌ల ద్వారా పేకాట ఆడుతున్నారన్నారు. ఇలాంటి చెడు వ్యసనాల వలన జేబులు గుల్ల కావడం మినహా ప్రయోజనం ఉండదన్నారు. ఎందరో ఆన్‌లైన్‌లో ఆటల ద్వారా జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఎవరైనా అతిగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. ముఖ్యంగా మైక్ అనుమతులు తీసుకుని రికార్డింగ్ డ్యాన్స్‌ల పేరిట అశ్లీల నృత్యాలు నిర్వహించడం నిషేధమన్నారు. చట్టపరంగా ఇది నేరమని నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు, ఏటీఎం కార్డుల వివరాలు కానీ, ఓటీపీలు కానీ ఎవరికి చెప్పినా ఖాతాల్లో నగదు దోచేస్తారన్నారు. అప్రమత్తంగా ఉండటం ద్వారానే సైబర్ నేరాలను నిరోధించగలమన్నారు. ఎవరైనా అన్యాయానికి గురైతే సమీపంలోని పోలీసుస్టేషన్‌లో, సైబర్ క్రైమ్‌కు సంబందించిన పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దీపావళిని పురస్కరించుకుని కొందరు ఇష్టానుసారంగా ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు అమ్ముతున్నారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గృహాల మధ్యలో పేలుడు పదార్థాలు ఉంచరాదన్నారు. లైసెన్స్ పొందిన వాళ్లు మాత్రమే పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారుల సూచనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసుల అమ్మకాలు చేయాలన్నారు. సమావేశంలో మార్కాపురం సీఐ పి.సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

నేటి నుంచి కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు

- ఒకే రోజు అన్నికేంద్రాల్లో ప్రారంభం
- 105 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- దక్షిణాది రీజియన్లలో రెండు రోజుల్లో ముగియనున్న మార్కెట్

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ప్రస్తుత సీజన్ (2024-25) పొగాకు కొనుగోళ్లు సోమవారం నుంచి మొదలుకానున్నాయి. అక్కడ మొత్తం పది వేలం కేంద్రాలు ఉండగా అన్ని చోట్లా ఒకేరోజున ప్రారంభిస్తున్నారు. గత రెండేళ్ల కర్ణాటకలో ఇచ్చిన అనుమతికన్నా పంట ఉత్పత్తి తగ్గింది. 2022-23లో 100 మిలియన్ కిలోలకు 60మిలియన్ కిలోలు మాత్రమే ఉత్పత్తి అయింది. 2023-24లో కూడా వంద మిలియన్ కిలోలకు అనుమతివ్వగా 80 మిలియన్ కిలోలు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లోనూ 100 మిలియన్ కిలోలకే పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 105 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా వేస్తున్నారు. అంటే గత ఏడాది కన్నా సుమారు 25 మిలియన్ కిలోలు అంతకు ముందు ఏడాది కన్నా 45 మిలియన్ కిలోలు అధికమైనట్లు సమాచారం. కాగా గతం కన్నా పంట ఉత్పత్తి కొంత పెరగడంతోపాటు నాణ్యత అంతగా లేదని తెలుస్తోంది. దాని ప్రభావం ధరలపై చూపే అవకాశం ఉంది. గత ఏడాది తొలి రోజున కిలో గరిష్ఠ ధర రూ.240తో ప్రారంభించిన వ్యాపారులు క్రమంగా పెంచుతూ కిలోకు రూ.292 ఇచ్చారు. ఆలాగే అత్యల్ప ధర కిలో రూ.200 పలికింది. సగటున కిలోకు రూ.259.22 ధర లభించింది. ఈసారి ప్రారంభ ధరను అక్కడి రైతులు కిలోకు రూ.275 కోరుతున్నట్లు తెలుస్తుండగా వ్యాపారులు రూ.250తో ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా రాష్ట్రంలో దక్షిణాది రీజియన్లలో పొగాకు మార్కెట్ మరో రెండు, మూడు రోజుల్లో ముగియనుంది. ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్లలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11వేలం కేంద్రాలు ఉండగా ఇప్పటికే ఎనిమిది చోట్ల కొనుగోళ్లు ముగిశాయి. సోమవారం రెండింటిలో, బుధవారం మరో రెండింటిలో పూర్తికానున్నాయి.

చీమకుర్తిలో మద్యంషాపులకు యమ గిరాకీ

చీమకుర్తి, అక్టోబరు 6 : చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు యమ గిరాకీ ఏర్పడింది. నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు, లైసెన్స్ ఫీజులు భారీగా పెంచినా మేం తగ్గేదిలే అన్నట్లు వ్యాపారులు భారీగా పోటీ పడుతున్నారు. ఈనెల ఒకటో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయగా మొదటి మూడురోజులు ఒక్క దరఖాస్తు కూడా అందకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ఉలిక్కిపడ్డారు. ఇదేమిటబ్బా అని అనుకున్నారు. కానీ గడచిన రెండురోజుల్లోనే అందిన దరఖాస్తుల సంఖ్య 50 దాటటం విశేషం. జిల్లాలోని అన్ని సర్కిల్స్‌లో చీమకుర్తి సర్కిల్ పరిధిలోనే ఇంత వరకు ఎక్కువగా దరఖాస్తులు అందటం మరో విశేషం. సర్కిల్ పరిధిలో చీమకుర్తి మున్సిపాలిటీ, రూరల్ మండలానికి కలిపి 9, సంతనూతలపాడు మండలం 4, మద్దిపాడు మండలం 3 మొత్తం సర్కిల్ పరిధిలో 16షాపులకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఫీజు రూ.2 లక్షలు చెల్లించి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 11న తీసే లాటరీలో ఎంపికైన వారు లైసెన్ ఫీజు కింద షాపునకు రూ.65 లక్షలు అదేరోజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజును షాపు దక్కకపోయినా వెనక్కి ఇవ్వరు. అంటే ఈపాటికే దరఖాస్తు ఫీజు రూపంలో ఇప్పటికే కోటి రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఈనెల 9వతేదీ వరకూ దరఖాస్తుకు అవకాశం ఉండటంతో ఇంకా వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

అవీ..ఇవీ..

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

గిద్దలూరు, అక్టోబరు 6 : స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.డీ.హనీఫ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక సమస్యను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కడప జిల్లాకు గిద్దలూరు మీదుగా వెళ్లే వెలిగొండ కాలువల నుంచి స్థానికులకు తాగునీటిని అందించాల న్నారు. గిద్దలూరు మున్సిపాలిటీలో డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పూర్ణ, ఆవులయ్య, థామస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనీఫ్

శిక్షణ కేంద్రం సందర్శన

గిద్దలూరు, అక్టోబరు 6 : విశ్వకర్మ పథకం కింద ఎంపికైన శిక్షణ కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం 18 రకాల చేతివృత్తుల వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా విశ్వకర్మ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ శిక్షణ కేంద్రంలో బుట్టల అల్లకం, కార్పెంటరీ, చర్మకార, వాషర్‌మెన్ తదితర వృత్తి శిక్షణ కార్యక్రమాలు చేపడతారన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎ.ఉదయ్‌శంకర్, బీవీ.రామాంజనేయులు, షేక్ ఖాదర్‌వలి, ఎం.పుల్లయ్య, జయప్రసాద్, వీరచక్రం తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్


ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

బేస్తవారపేట, అక్టోబరు 6 : బేస్తవారపేట కేజీబీవీ విద్యార్థులకు గిద్దలూరులో సమగ్ర శిక్షణ టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి విద్య ఇంటర్ షిప్ కార్యక్రమం నిర్వహించారు. దసరా సెలవులలో విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా బేకరీలలో వృత్తి విద్యను నేర్పిస్తారని ఉపాధ్యాయురాలు ఎం.నాగరత్నం తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో ఈ రంగంలో అవసరమైన నైపుణ్యత పొందుతారన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 6: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

నల్లగుంట్లకు రహదారి నిర్మించేనా?


అస్తవ్యస్తంగా తయారైన నల్లగుంట్లకు వెళ్లే ప్రధాన రహదారి

పెద్దదోర్నాల, అక్టోబరు 6: మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. మండలంలోని శివారు గ్రామం నల్లమల అటవీ ప్రాంతానికి అత్యంత సమీపంలో నల్లగుంట్ల ఉంది. గ్రామంలో అధిక శాతం మంది వ్యవసాయాధారిత ప్రజలు నివసిస్తున్నారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి గ్రామానికి మూడు కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి ఉంది. కాగా దశాబ్దాల క్రితం నిర్మించిన తారురోడ్డు శిథిలావస్థకు చేరింది. అడుగడుకో గుంత ఏర్పడి ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారింది. ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి రావాల్సి ఉంది. ఈ గ్రామానికి నిత్యమూ ఏదొక పని మీద ప్రయాణించాల్సి ఉంది. వ్యవసాయానికి అవసరమయ్యే ఎరువులు, పంట దిగుబడులు తదితరములు సరఫరా చేయాలంటే రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఆటోలు మోటారు సైకిళ్లపై కూడా తరలించే పరిస్థితి లేక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలమయితే మరింత ధారుణంగా ఉంటోంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు పునఃనిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూలగుంటపాడులో భారీ చోరీ

- 47 సవర్ల బంగారం, 11కిలోల వెండి, రూ.3లక్షల నగదు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సింగరాయకొండ, అక్టోబరు 6 : మండలంలోని మూలగుంటపాడులో భారీ చోరీకి గుర్తుతెలియని దుండగులు పాల్పడ్డారు. ఇంటిలో ఎవరూలేని సమయంలో లోపలికి ప్రవేశించి 47 సవర్ల బంగారాన్ని, 11 కేజీల వెండి, రూ. 3 లక్షల నగదును అపహరణ చేశారు. వివరాలలోకి వెళ్తే.. మూలగుంటపాడు హెచ్‌పీగ్యాస్ కంపెనీ సమీపంలోని పొత్తూరి ఎల్‌ఐసీ ఏజెంట్ శ్రీరామమూర్తి తన మామ నెల్లూరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఈ నెల 1న అక్కడికి వెళ్లారు. ఆదివారం శ్రీరామమూర్తి ఒక్కరే మూలగుంటపాడు వచ్చాడు. ఇంటిలోపలికి వెళ్లగా బెడ్‌రూమ్‌లో కప్‌బోర్డ్ తెరిచి ఉన్నాయి. వస్తువులు, బ్యాగులు చిందరవందరగా మంచంమీద పడవేసి ఉన్నాయి. వంటగదిలోకి వెళ్లి చూడగా దక్షిణం వైపు ఉన్న కిటికి గ్రిల్ తొలగించి కిందపడేసి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బి. మహేంద్ర ఇంటిని పరిశీలించారు. ఆ తరువాత ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ హజరత్తయ్య, సీసీఎస్ సీఐ దాచేపల్లి రంగనాథ్ వచ్చారు. చోరీ చేసిన ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే క్లూస్‌టీంను, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై బి. మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

జూదరుల అరెస్టు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 6 : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.9300 నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని దంతెరపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ కె.సురేష్ దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.9300 స్వాధీనం చేసుకున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, అక్టోబరు 6: సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిదిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి పూజించారు. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ ఛైర్మన్ గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో..

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 6: సీఎస్‌పురం మండలంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామి వారి మూల విరాట్‌కు మహానివేదన, అభిషేకం, గోపూజ చేశారు. మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదిక్షణ చేసి స్వామివారికి సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్‌పురం మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి, దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, వరికూటి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పామూరు, అక్టోబరు 6: పామూరు పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడి ఉన్న రేషన్ బియ్యాన్ని ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షేక్ సమీఉల్లా, సివిల్ సప్లయిాస్ డీటీ గోపాలుని రమేష్ స్వాధీనం చేసుకున్నారు. గత నెల 11న అప్పటి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఎం.వెంకట రాజేష్ సిబ్బందితో పామూరు నుంచి కందుకూరుకు తరలివెళుతున్న సుమారు 60 టిక్కీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయిాస్ అధికారులు ఆదివారం స్టేషన్‌కు వచ్చి రేషన్ బియ్యం టిక్కీలతో ఉన్న వాహనాన్ని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలిచారు.

ప్రపంచ శాంతిని కాపాడాలి

దొనకొండ, అక్టోబరు 6: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని భారత ప్రభుత్వం ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. యుద్ధం ఆపాలి, ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన పాలస్తీనాకు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రపంచ శాంతి చర్యలకు ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తాండవ రంగారావు, చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి అనీల్, కోలా కిరణ్, కృష్ణ, ప్రభాకర్, కోటేశ్వరరావు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

టైర్ల దుకాణం దగ్ధం

కురిచేడు, అక్టోబరు 6: వాహనాలకు పంక్చర్లు వేసే టైర్ల దుకాణం దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని పొట్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. యజమాని వెంకట్రామయ్య తెలిపిన సమాచారం మేరకు.. మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి దుకాణంలో ఉన్న టైర్లు, ట్యూబులు, ద్విచక్ర వాహనాల స్పేర్‌పార్ట్స్ దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు వాపోయాడు. స్థానికులు మంటలను అదుపు చేయటంతో పక్కనఉన్న దుఖాణాలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దర్శి అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపుచేశారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 6: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. గొర్రెల, మేకల పెంపకందారులను ఏ ప్రభుత్వం వచ్చినా చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. గత ఏడు నెలల నుంచి పశువుల హాస్పటల్స్‌కు మందులు రావడం లేదన్నారు. వివిధ రకాల జబ్బులు, యాక్సిడెంట్లు, పిడుగుపాటుకు వేలాది జీవాలు మరణించిన సందర్భాలు అనేకం ఉన్నా నష్టపరిహారం అందడం లేదని తెలిపారు. గొర్రెల షెడ్లు 90శాతం సబ్సిడీతో అర్హత ఉన్న వారందరికి నిర్మించాలని, 50శాతం సబ్సిడీతో పెంపకం దారులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల రుణం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్, మద్ది బోయిన శేషు, కందరాజు జయరాం, కండే బాలకృష్ణ, జనార్దన్, బుర్రా శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన కల్యాణ మండపం

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకుపడని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిపాజిట్‌దారులు
- పట్టించుకోని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం కోసం కేటాయించిన రామాలయం మాన్యం భూమి



వైసీపీ హయాంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

దర్శి, అక్టోబరు 6: దర్శి పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో రామాలయం మాన్యం భూమిలో నిర్మించతలపెట్టిన టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపనకే పరిమితమైంది. దర్శి ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో రూ.50 లక్షలు డిపాజిట్ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి 2021లో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఆతర్వాత నిర్మాణం గురించి పట్టించుకోలేదు. కల్యాణ మండపం నిర్మాణం కోసం రామాలయం మాన్యం భూమిని ఎకరం స్థలం కేటాయించారు. పట్టణ ప్రజలు విరాళాలు ద్వారా రూ.50 లక్షలు సొమ్ము సేకరించి డిపాజిట్ చెల్లించారు. అదిగో, ఇదిగో నిర్మాణానికి నిధుల విడుదలవుతాయని వైసీపీ పాలకులు రెండేళ్లు గొప్పలు చెప్పారు. 2024 ఎన్నికలు జరిగే వరకు నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. కల్యాణ మండపం నిర్మాణం వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మూలన పడింది.

డిపాజిట్ సొమ్ము ఏమైంది..

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం కోసం చెల్లించిన డిపాజిట్ ఏమైందో అర్థంకావటం లేదు. ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. వైసీపీ హయాంలో అనేక చోట్ల కల్యాణ మండపాల నిర్మాణం కోసం ఇలాగే డిపాజిట్లు వసూళ్లు చేశారు. అవి అలాగే ఉన్నాయా, ఎవరి జేబులోకి అయినా వెళ్లాయా అన్న విషయం తెలియడంలేదు. టీటీడీలో అన్ని విభాగాల్లో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. లడ్డూ తయారీలో కల్తీ విషయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డిపాజిట్ల సేకరణ కూడా అప్పటి పాలకులు దిగమింగి ఉంటారని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టీటీడీలో జరిగిన అక్రమాలు బయటకు తీస్తున్నారు. దర్శి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ కూటమి ప్రభుత్వంలో నెరవేరబోతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ఏదశలో ఉందో ఉన్నతాధికారులు పరిశీలించి నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

దర్శి, అక్టోబరు 6: దసరా ఉత్సవాల్లో భాగంగా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం స్థానిక కనకదుర్గమ్మ ఆలయం, పోలేరమ్మ గుడి, దద్దాలమ్మ ఆలయంలో లలితా పరమేశ్వరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకు న్నారు.



దర్శి: లలితాపరమేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



కనిగిరి: బాలార్కకోటేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపురసుందరీదేవిగా పార్వతీదేవి

కనిగిరిలో..

కనిగిరి: దసరా మహోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు ఆదివారం బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. కనిగిరి మండలంలోని నందనమారెళ్ళలోని కొండపై కొలువైన బాలార్క కోటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి సమేత పార్వతిదేవి భక్తులకు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని దొరువులో వెలసిని దుర్గాదేవి, అంకాళమ్మ, దొంతులమ్మ, వాసవీకన్యకా పరమేశ్వరి, దత్తపీఠం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాల్లోని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

పామూరులో..

పామూరు: దసరా నవరాత్రుల వేడుకల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఅన్నపూర్ణా దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి దేవస్థానం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శాకాంబరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దొనకొండ: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలో ఆదివారం శ్రీఈశ్వరాంబ అమ్మవారు శ్రీ శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 18 రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర శతనామవాళి, కుంకుమ పూజలు చేశారు. దూపదీప నైవేద్యాలు సమర్పించి సామూహిక హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

పీసీపల్లి: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా మండలంలోని పెదయిర్లపాడు మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాళ్లూరులో..

తాళ్లూరు: తాళ్లూరులోని రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కన్యకాపరమేశ్వరి, తూర్పుగంగవరంలోని వాసవీమాత, గంగాభవానీ దేవాలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు ఆదివారం శ్రీమహాలక్ష్మి, లలితాత్రిపురసుందరి, లలితాదేవి అవతారాల్లో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలు, అష్టోత్తర లలితాసహస్రనామ పూజలు, దుర్గాదేవి స్తోత్రం ఆలాపన చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పామూరు: అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీమాత



దొనకొండ: ఆనంద ఆశ్రమంలో ధనలక్ష్మీదేవిగా అమ్మవారు



తాళ్లూరు: తూర్పుగంగవరంలో లలితా దేవి అలంకరణలో వాసవీమాత



పీసీపల్లి: అన్నపూర్ణాదేవీగా దర్శనమిస్తున్న అమ్మవారు

రహదారులు ఇలా.. ప్రయాణం సాగేది ఎలా..!

- మరమ్మతులకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, అక్టోబరు 6: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ళతరబడి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రహదారులపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి పోసిన పాపాన పోలేదు. గోతుల రోడ్లపైనే గత్యంతరంలేని పరిస్థితిలో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పది నిమిషాలు పట్టే ప్రయాణం అరగంట నుంచి గంట సమయం పడుతుందంటే రహదారులు ఎంత అధ్వానంగా ఉన్నాయో తెలుస్తుంది.

మండలంలోని ముఖ్యమైన రహదారుల్లో పెదఉల్లగల్లు - వేముల రహదారి పది కిలో మీటర్లు ఉంటుంది. ఉల్లగల్లుకు కిలో మీటరు దూరం నుంచి రాజగోపాలరెడ్డినగర్, కమ్మవారిపాలెం, రమణారెడ్డిపాలెం రహదారి అంతా గోతులమయమైంది. వాహనచోదకులు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. కనీసం గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. ఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళటానికి కేవలం 15 నిమిషాల సమయం పడుతుంది. గోతులమయమైన రహదారిలో అరగంట నుంచి ముప్పావు గంట ప్రయాణం పడుతుంది. రాత్రుల సమయాల్లో కొత్త వ్యక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి.



అధ్వానస్థితికి చేరిన పెదఉల్లగల్లు - వేముల రహదారి

పెదరావిపాడు నుంచి నాయుడుపాలెం వెళ్ళే మూడు కిలో మీటర్ల రోడ్డులో ఐదేళ్లలో తట్ట మట్టి పోసిన దాఖలాలులేవు. కంకర లేచిపోయి రాళ్ళు బయట పడటంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు టైర్లు పంచర్లు కావటం, పగిలి పోవటం నిత్యం జరుగుతుంది. అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారు ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు.



గోతులమయమైన ముండ్లమూరు - తాళ్ళూరు ఆర్‌అండ్‌బీ రహదారి

అలాగే, పెదఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్ వెళ్ళే ప్రధాన రహదారి అధ్వానస్థితికి చేరింది. మూడు కిలో మీటర్లు ఉండే ఈ రహదారిలో అడుగడుగునా గోతులుపడ్డాయి. పెద్ద పెద్ద గొయ్యిలు పడి వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. రెడ్డినగర్ నుంచి బసవాపురం వెళ్ళే రహదా రి కూడ దారుణంగా ఉంది. ఈమార్గంలో తారు రోడ్డు వేసేందుకు టెండర్లు పిలిచారు. వైసీపీ ప్రభుత్వంలో వేసిన కాంట్రాక్టర్ ఇంతవరకు ఆ వైపు కన్నెత్తి చూడ లేదు. వర్షం కురిస్తే చాలు గోతుల్లో నిండుగా నీరు నిలబడి రహదారి ఉందా, లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక మండలంలో ముఖ్యమైన ముండ్లమూరు నుంచి తాళ్ళూరు వెళ్ళే రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో రెండు కిలో మీటర్ల వరకు తారు లేచిపోయి ఐదు సంవత్సరాలైంది. పెద్ద పెద్ద గోతులు పడి వాహనాలు వెళ్ళలేని పరిస్థితి. ఇంత అధ్వాన్నంగా ఉన్నా అధికారులు గాని, పాలకులు గాని ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. అనేక మంది వాహన చోదకులు గోతుల్లో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. గత ఏడాది సంతనూతలపాడు గ్రామానికి చెందిన ఆటో బోల్తా పడటంతో ఆటో యజమాని అక్కడికక్కడే మృతి చెందాడు. నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వెళ్ళే రహదారిలో భట్లపల్లి - సుంకరవారిపాలెం వద్ద గోతులమయమైంది.



పెదరావిపాడు - నాయుడుపాలెం రహదారి దుస్థితి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు తాత్కాలిక మరమ్మతులైనా చేసి వాహన చోదకుల కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నదే లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- దొనకొండలో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

దొనకొండ, అక్టోబరు 6: దర్శి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనే లక్ష్యం తోనే తాము ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న ట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్సీఎం పాఠశాల ఆవరణలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్ర జాపాలన సాగుతుందన్నారు. వారి స్ఫూర్తితో దర్శి ని యోజకవర్గంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి, ప్రజాఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టు చెప్పారు. అందులోభాగంగానే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గతంలో దర్శిలో ఈశిబిరం నిర్వహించామన్నారు. ఆదివారం దొనకొండలో నిర్వహి స్తున్నామన్నారు. ప్రతినెలా మండల కేంద్రాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నా మన్నారు.

ఇటీవల దర్శిలో జాబ్ మేళా నిర్వహించి 587 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్టు డాక్టర్ లక్ష్మి పేర్కొ న్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రా ష్ట్ర మంత్రులు, ఎంపీల సహకారంతో దర్శిని అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మె ల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయ కుడు డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చై ర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, మోడి వెంకటేశ్వర్లు, పులిమి రమ ణా యాదవ్, కామేపల్లి చెంచయ్య, రాచగొర్ల వెంకటయ్య, వల్లపునేని వెంకటస్వామి, కొత్తం రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వైద్య పరీక్షలకు గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి భోజనాలు ఏర్పాటుచేశారు.

శంకర కంటి వైద్యశాల సిబ్బంది డాక్టర్ జాగృతి, డాక్టర్ వందన పరీక్షలు నిర్వహించారు. 60 మందికి కం టి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. ఆదివారం పది మందిని తీసుకెళ్లగా, 8వ తేది 50 మందిని తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించనున్నట్టు వారు తెలిపారు.

హెల్మెట్ ధరించకపోతే లైసెన్స్ రద్దు చేస్తాం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీరాం

కనిగిరి, అక్టోబరు 6: హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్‌ఐ శ్రీరాం హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఉస్తుంవారిపల్లి అడ్డరోడ్డు వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాల్ని నడిపిన సమయంలో ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి రోడ్డుపై పడినపుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ ఎంతో రక్షణ ఇస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో శరీరంలో ఎక్కడ గాయమైన ప్రాణాలకు 90శాతం ఇబ్బంది ఉండదన్నారు. హెల్మెట్ లేకుండా ప్రమాదం జరిగిన సమయంలో తలకు గాయమైతే 90శాతం ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వాహనం నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. 40కి.మీ కంటే వేగంగా నడిపితే ఏదైనా అనుకోకుండా రోడ్డుకు అడ్డంగా వచ్చినపుడు బైకును అదుపు చేయలేరన్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే తనతోపాటు ఎదురెదురుగా వచ్చే వాహనదారులను కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా నడపడం చట్టరీత్యా నేరమని, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఒకసారి లైసెన్స్ రద్దయితే భవిష్యత్తులో ఎట్టి పరిస్థితిలోనూ లైసెన్స్ పొందే అవకాశం కోల్పోతారని అన్నారు.



ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజు క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

■ 2 BHK, 1278 SFT, 502, ANJANEYA ENCLAVE, BHAGYA NAGAR, 4th Lane, Opp. Andhra Pragati Grameen Bank, Ongole - 523001, Contact - P. Radha Krishna, 9373282002 / 8999790130.

AJO-190375

జ్యోతిష్యాలయం

■ ఆదిశక్తి రేణుక యల్లమ్మ తల్లి జ్యోతిష్యము చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, సంతానం, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఏ సమస్యకైన పరిష్కారం చెప్పబడును. సంప్ర: G.కృష్ణంరాజు, R.T.C.బస్టాండు దగ్గర, ఒంగోలు, సెల్: 9640409458

AJO-200161

ప్లాట్లు అమ్మబడును

■ ఒంగోలు కార్పోరేషన్ లిమిట్స్‌లో అన్ని వసతులతో ఓపెన్ ప్లాట్స్ మరియు DTCP అప్రూవడ్ ప్లాట్లు కలవు. KR డెవలపర్స్. సెల్: 8499816663.

AJO-200074

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k. Ph:9640258899, 9640468899

AJH-15274

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నష్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 7 అక్టోబరు 2024





సాగునీటి సంఘాలు లేకపోవడంతో మరమ్మతులు లేక అధ్వానంగా మారిన ఓ కాల్వ

సాగునీటి సంఘాలపై కసరత్తు

పుష్కలంగా నీరందితేనే పంటలు పచ్చగా కళకళలాడి మంచి దిగుబడిని ఇస్తాయి. అయితే అలా జరగాలంటే సాగునీటి కాల్వలు బాగుండాలి. ఇందుకోసం గత ప్రభుత్వాలు ప్రత్యేకంగా కాల్వల పరిధిలోని ఆయకట్టు రైతులతో కమిటీలు వేసి కాల్వల మరమ్మతులు, నీటి నిర్వహణ తదితరాలను వారి ఆధ్వర్యంలోనే జరిగేలా చేసేవి. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని రంగాల మాదిరిగానే సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసింది. పైగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు లేకుండా చేయడంతో పాటు ఆ నిధులను దారిమళ్లించేసింది. దీంతో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారి నీటి పారుదల సక్రమంగా సాగక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి సారించి.. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేపట్టింది. సాగునీటి కాల్వల పరిధిలో ఆయకట్ట వారీగా సర్వే నెంబర్లు ఆధారంగా రైతులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. ఓటర్ల గుర్తింపు అనంతరం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

- ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి
- సాగర్ కుడికాల్వ పరిధిలో 259 నీటి సంఘాలు
- రైతుల గుర్తింపునకు సర్వే నెంబర్లు సేకరణలో అధికారులు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం నిర్వీర్యం.. నిధుల మళ్లింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పూడిక, తూటికాడతో నిండిపోయిన సాగునీటి కాల్వలు.. వాటి మరమ్మతులపై ఆలోచన చేయని పాలకులు.. సాగునీరు సక్రమంగా అందక నష్టపోయిన రైతులు.. నిధుల లేమితో కాల్వల మరమ్మతులను పట్టించుకోని అధికారులు.. ఇదీ ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం దుస్థితి. ఈ క్రమంలో సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగునీటి పారుదల వ్యవస్థ పర్యవేక్షణలో కీలకమైన సాగునీటి ఎన్నికల నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ సమాయత్తమవుతోంది. రానున్న రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల నిర్వహణపై జలవనరులశాఖ అధికారులతో ఇటీవల సమీక్షించారు. రెవెన్యూ శాఖను కూడా ఎన్నికల నిర్వహణలో భాగస్వామని చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే నీటి సరఫరా.. కాల్వల మరమ్మతుల్లో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీ కాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవ డం తో జలవనరుల నిర్వహణ గాడి తప్పింది. కాల్వలు పూడికతో నిండి అధ్వానంగా తయారయ్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో నాగార్జునసాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీలో 259 నీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటికి ఎన్నికల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో సాగునీటి కాల్వల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఎన్నికలకు ఆదేశించింది.

నీటి తీరువా వసూలు.. దారిమళ్లింపు

సాగర్ కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదు శాతం కేటాయిస్తారు. 80 శాతం నిధులను మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగునీటి కమిటీల వారీగా కేటాయిస్తుంది. వైసీపీ హయాంలో ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లగా జరగలేదు. నీటి తీరువా నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ప్రతి ఏటా రూ.20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. ఈ నిధులను కాడాకు చేరకుండా వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. సాగునీటి సంఘాల ఎన్నికలు జరగకపోవడంతో అధికారులకు ప్రభుత్వం నీటి సంఘాల బాధ్యతలను అప్పగించింది. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్ఈకి, డిస్ట్రిబూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటిసంఘాల బాధ్యతలను డీఈ, జేఈలకు కేటాయించింది. నీటి సంఘాలు లేకపోవడంతో కాల్వ పనుల పర్యవేక్షణను కూడా ఆయా అధికారులకే అప్పగించారు. ఐదేళ్లగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాల్వల మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. ఈ పరిస్థితుల్లో సాగు నీటి సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పల్లెల్లో ఎన్నికల సందడి..

తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. వైసీపీ ఐదేళ్లు సాగునీటి ఎన్నికలను విస్మరించగా కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొనున్నది. ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతుల్ని ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగునీటి సంఘాల వారీగా ఓటర్లను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుంది. రెవెన్యూ, జలవనరుల శాఖలు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తాయి. ప్రభుత్వ ఉత్తర్వు మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు సదరు అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ)కు కమిటీలను టీసీ సభ్యులు ఎన్నుకుంటారు. ఈ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. డీసీల నుంచి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.



నరసరావుపేటలోని ప్రాజెక్టు కమిటీ, డీసీ కార్యాలయాలు

అన్నపూర్ణా.. నమోస్తుతే..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవార్లు అన్నపూర్ణాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులతో ఆయా ఆలయాల్లో సందడి నెలకొంది. అమ్మవార్ల దర్శనం అనంతరం తీర్థప్రసాదాల వితరణ జరిగింది. - బాపట్ల

బాపట్ల శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీలలిత త్రిపురసుందరి దేవిగా అమ్మవారు





చందోలు గ్రామంలో శ్రీలలితా త్రిపుసుందరీదేవి అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

అమృతలూరు: గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు




రేపల్లె: చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



రేపల్లె: చెరుకుపల్లి మండలం రాజవోలులో శ్రీకాళికాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు




వారణాసి రైలుకు.. ఆటంకాలు





- పట్టాలెక్కకుండా ఇతర జోన్ల మోకాలడ్డు
- ఐఆర్‌టీటీసీలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన
- కేంద్ర మంత్రి, ఎంపీలు చొరవ చూపిస్తే మంజూరయ్యే అవకాశం

గుంటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లుగానో గుంటూరు మీదగా శివభక్తుల సౌకర్యార్థం వారణాసికి రైలు నడపాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షకి ప్రతిబంధకాలు తలెత్తాయి. తిరుపతి - వారణాసి వయా న్యూ గుంటూరు నూతన రైలుని దక్షిణ మధ్య రైల్వే ఇటీవల జరిగిన ఐఆర్‌టీటీసీ-2024 సమావేశంలో ప్రతిపాదించింది. అయితే ఈ రైలు ప్రయాణించాల్సిన మార్గంలోని ఇతర రైల్వే జోన్లు తమకు ఆటంకాలు ఏర్పడతాయని చెప్పి మోకాలడ్డాయి. లేకుంటే ఈ పాటికి ఎంతోమందికి ఉపయోగపడే ఈ రైలు పట్టాలెక్కి ఉండేదే. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు ఉన్న నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు చొరవ తీసుకుని ప్రయత్నిస్తే కచ్చితంగా ఈ రైలుకు అడ్డంకులు తొలగించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా వారణాసి(కాశీ), తిరుపతి వెలుగొందుతున్నాయి. నిత్యం ఈ రెండు పుణ్యక్షేత్రాలకు వేలల్లో భక్తులు సందర్శిస్తుంటారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు పుణ్యక్షేత్రాలను కలిపే ఒక్క రైలు కూడా అందుబాటులో లేదు. ఎవరైనా కాశీ సందర్శనకు వెళ్లాలంటే వారంలో రెండు రోజులు విజయవాడ మీదగా ప్రయాణించే గంగా కావేరి, ఒక రోజు ప్రయాణం చేసే పట్నా, కాశీ - తమిళ సంఘం, రామేశ్వరం - బనారస్ రైళ్ల కోసం వేచి చూడాల్సిందే. వాటిల్లో విజయవాడ కోటా చాలా తక్కువగా ఉంటున్నందున 120 రోజుల ముందుగానే టిక్కెట్లు బుకింగ్ అయిపోతున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుని తిరుపతి - వారణాసి రైలుని ప్రవేశపెడితే అటు శివుడు, ఇటు వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఐఆర్‌టీటీసీ దక్షిణ మధ్య రైల్వే జోన్ మీటింగ్‌కు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి ఈ రైలు తెనాలి - న్యూగుంటూరు - మంగళగిరి(అమరావతి రాజధాని ప్రాంతం) - విజయవాడ మీదగా సమయపట్టిక కూడా రూపొందించారు. అయితే ఈ రైలుకు ప్రతిపాదించిన సమయంలో తమకు వేరే రైళ్లు ఉన్నాయని చెప్పి అంగీకారం తెలపలేదు. దీంతో ఈ ప్రతిపాదన మరుగున పడిపోయింది. గతంలో కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఉండగా, ఇక్కడ వైసీపీ ప్రభుత్వం ఉన్నది. దీని వల్ల ఎలాంటి ఉపయోగం రైళ్లపరంగా జరగలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి గెలిచిన టీడీపీ, జనసేన ఎంపీలపై ఆధారపడి ఎన్‌డీఏ-3 కూటమి ప్రభుత్వం దేశాన్ని పరిపాలిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ రైల్వే డిమాండ్లు సాధించుకోలేమనేది వాస్తవం. ఈ దృష్ట్యా ఢిల్లీకి వెళ్లినప్పుడు ఎంపీలంతా సమష్టిగా రైల్వే మంత్రి, రైల్వే బోర్డు ఛైర్మన్‌తో భేటీ అయి తిరుపతి - వారణాసి రైలు ఆవశ్యకతని వివరిస్తే సాధ్యమైనంత త్వరలోనే ఈ రైలు మంజూరయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.



ప్రతి ఎకరాకు సాగునీరు

- వచ్చే సీజన్‌కు కొరిశపాడు, భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తి
- గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు పెట్టడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- అద్దంకి బ్రాంచి కెనాల్ పరిశీలనలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 6: సాగర్, గుండ్లకమ్మ రిజర్వాయర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి బ్రాంచి కెనాల్ (ఏబీసీ) 18వ మైలు బాపట్ల జిల్లా సరిహద్దు వద్ద ఆదివారం ఆయన నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడి నుంచే ఈఎంసీ వెంకటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో 1.80 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉన్నందున ఏబీసీ హెడ్ వద్ద 2,100 క్యూసెక్కులు విడుదల చేయాలని, 18 మైలు వద్ద 1,200 క్యూసెక్కులకు తగ్గకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో మేజర్ కాల్వల్లో ఎక్స్‌కవేటర్‌తో యుద్ధప్రాతిపదికన పూడికతీత, చిల్లచెట్లను తొలగించాలన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు పెట్టడంలో గత వైసీపీ పూర్తి నిర్లక్ష్యం వహించందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు పెట్టే పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే 10 గేట్ల ఏర్పాటు పూర్తయిందని, మరో రెండు గేట్లు కూడా వెంటనే ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసి ఆయకట్టుకు విడుదల చేస్తామన్నారు. వైసీపీ నాయకులకు కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి యర్రం చినపోలిరెడ్డి పేరు పెట్టడంలో ఉన్న శ్రద్ధ పనులు పూర్తి చేయడంలో చూపించలేదన్నారు. వారి నిర్లక్ష్యంతో వచ్చిన పరిహారం కూడా వెనక్కిపోయిందన్నారు. కొరిశపాడు, తూర్పుపాలెం ముంపు గ్రామాల రైతులకు రూ.85 కోట్లు చెల్లించి వచ్చే సీజన్‌కు కొరిశపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామని, భవనాసి రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

అద్దంకి బ్రాంచి కెనాల్ 18వ మైలు వద్ద నీటి విడుదలను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి



చోరీ కేసుల్లో నలుగురు అరెస్టు

- రూ.4.13 లక్షల సొత్తు స్వాధీనం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 6: బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో నిందితులైన నలుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ జగదీష్‌నాయక్ తెలిపారు. ఆదివారం వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి కేసుల వివరాలను డీఎస్పీ ప్రకటించారు. పొన్నూరు, బాపట్ల, చీరాల, వేటపాలెం, ఒంగోలు, టంగుటూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. గతనెల 30న రాత్రి మద్దిరాల గ్రామానికి చెందిన పెదపూడి పాలెం రాజు రైల్వే స్టేషన్ నుంచి తన తల్లిని బైక్‌పై తీసుకెళ్తుండగా కడవకుదురు రైల్వే గేటు దాటిన తర్వాత ఐదుగురు వ్యక్తులు రెండు బైకులపై వచ్చి బెదిరించి బైక్‌ను, ఫోన్‌ను తీసుకువెళ్లారు. బాధితుడు వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా 216 జాతీయ రహదారిలో వేటపాలెం క్రాస్‌రోడ్డు వద్ద శనివారం వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో షేక్ మదర్(పొన్నూరు టౌన్), దేవరకొండ మదన్‌సాయి (ఒంగోలుటౌన్), చేగుడి ఆనంద్ బాబు (బాపట్ల టౌన్), శీలం వంశీకృష్ణ (బాపట్లటౌన్) పట్టుబడగా షేక్ సైదా(బాపట్లటౌన్) పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి ఐదు బైక్‌లు, 23 ఫోన్లు, ఒక ట్యాబ్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.4.13 లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితులపై గతంలో పలు చోట్ల పలు కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీస్ బృందానికి ఎస్పీ అభినందనలు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

16 తర్వాత అందుబాటులోకి ఇసుక

- జిల్లాలోని స్టాక్ యార్డుల్లో 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ
- కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 6: వరద ప్రభావంతో నదీగర్భంలో ఇసుక తీయడం సాధ్యపడనందున ఈ నెల 16 తర్వాత ఇసుకను అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గత నెలో ఎన్నడూ లేనివిధంగా కృష్ణా నదికి 11.5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. ప్రస్తుతం కూడా 45 వేల క్యూసెక్కుల ప్రవాహం నదిలో ఉందన్నారు. దీనివల్ల ఇసుక తీయడానికి సాధ్యపడటంలేదని చెప్పారు. గాజులంక, జువ్వలపాలెంలో రెండు క్వారీలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి ప్రస్తుతం ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. కొల్లూరు మండలం గాజులంక-2, భట్టిప్రోలు మండలం ఓలేరుతో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఇసుక తీతకు గుర్తించామన్నారు. మొత్తం ఆరు చోట్ల 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమౌతుందన్నారు. ఇవికాకుండా పట్టా ల్యాండ్‌లో ఇసుక తవ్వి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు కూడా చేస్తున్నామన్నారు. దీని ద్వారా మరో 1.50 లక్షల మెట్రిక్‌టన్నుల ఇసుక లభ్యమౌతుందన్నారు. 4 లక్షల మెట్రిక్ టన్నులు డిమాండ్ కాగా మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వస్తుందన్నారు. అందువల్ల జిల్లాలో ఇసుకకు ఇబ్బందులు ఉండవన్నారు.

దళారుల బెడద లేకుండా టాస్క్‌ఫోర్స్

ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రభుత్వం ప్రజలకు ఇసుకను అందిస్తున్నదని కలెక్టర్ తెలిపారు. ఇసుక విషయంలో దళారుల బెడద లేకుండా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా డంప్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక క్వారీల వద్ద సీసీ కెమెరాలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు విస్తృతం చేస్తామన్నారు. సమావేశంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, మైనింగ్ ఏడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్

యువకుడిని కాపాడిన గజఈతగాళ్లు

- ఎమ్మెల్యే కొండయ్య ముందుచూపుతో తీరంలో రక్షణ చర్యలు
- సముద్రంలో కొట్టుకుపోతుండగా దక్కిన ప్రాణం
- ఊపిరిపీల్చుకున్న కుటుంబ సభ్యులు, స్థానికుల అభినందనలు

చీరాల, చీరాలటౌన్, అక్టోబరు 6 : చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముందు చూపు చర్యలు ఆదివారం ఓ యువకుడి ప్రాణాలను కాపాడాయి. చీరాల మండలం వాడరేవుకు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన బాషా అనే యువకుడు మరి కొందరితో కలసి ఆదివారం సముద్రస్నానానికి వచ్చారు. ప్రమాదవశాత్తు అలలతాకిడికి బాషా కొట్టుకుపోతుండగా గమనించిన గజ ఈతగాళ్లు సున్నపు రాము, వాయిల గోపీనాథ్, మెరైన్ పోలీసులు రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అక్కడున్న స్థానికులు ఎమ్మెల్యే కొండయ్య చేపట్టిన చర్యలను గుర్తు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. అప్పట్లో ఎమ్మెల్యేపై వేసిన నిందలకు కాలమే సమాధానం చెప్పినట్లయిందని వారు పేర్కొనడం విశేషం. ప్రాణాపాయం నుంచి బయటపడిన బాషా మాట్లాడుతూ దేవుడిని నేను ఎప్పుడు చూడలేదు. ఎమ్మెల్యే కొండయ్య చర్యలు దేవుని రూపంలో తనకు పునర్జన్మనిచ్చిందని కన్నీటిపర్యంతమయ్యారు.

గతంలో ఏం జరిగింది

నాలుగు నెలల కిందట చీరాల నియోజకవర్గ పరిధిలోని వాడరేవు, రామాపురం తీరప్రాంతానికి వచ్చిన పర్యాటకులలో పలువురు ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డారు. వరుస ఘటనలు జరిగాయి. ఆ క్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత చీరాల మండలం ఈపురుపాలెంలో హత్యాచారానికి గురైన యువతి కుటుంబ సభ్యులను పరామర్శించేదుకు వచ్చారు. అదేరోజు రామాపురం తీరంలో మంగళగిరి నుంచి వచ్చిన నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి అనిత భవిష్యత్‌లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడతామన్నారు. ఆ తరువాత విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా అదే విషయమై తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని అధికారులను ఆదేశించారు.


యువకుడిని కాపాడి ఒడ్డుకు తీసుకొస్తున్న గజఈతగాళ్లు

ఎమ్మెల్యే కొండయ్యకు మంత్రి లోకేష్ ఫోన్.. ఘటనలపై ఆరా

తీరప్రాంతంలో జరిగిన వరుస మరణాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే కొండయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. తీరప్రాంతంలో నెలకొన్న పరిస్థితిపై ఆరా తీశారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సహకరించాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు కొండయ్య కార్యాచరణ

తీరంలో ప్రమాదాల నివారణకు ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా చీరాల బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులతో కలసి ఒకటికి రెండు పర్యాయాలు చర్చలు జరిపారు. భవిష్యత్‌లో తీరానికి వచ్చిన వారిలో ఏ ఒక్కరికీ ప్రాణహాని జరగకూడదని, నిర్ణయాత్మకమైన చర్యలు చేపట్టే వరకూ తీరానికి పర్యాటకులను రావద్దని సూచించారు. కలెక్టర్, ఎస్పీలు కూడా అదే విషయాన్ని చెప్పారు. తీరంలో నియోజకవర్గం పరిధిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు, గజ ఈతగాళ్లను నియమించడం, వాచ్ టవర్లను ఏర్పాటు చేయడం తదితర ముందు జాగ్రత్తలకు సంబంధించి రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

నాడు నిందలు.. నేడు అభినందనలు

రిసార్ట్స్ నిర్వాహకులతో జరిపిన చర్చల్లో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ భవిష్యత్‌లో తీరానికి వచ్చే ఏ ఒక్కరికీ ప్రాణహాని జరుగకుండా చర్యలు చేపడదామన్నారు. కొంతకాలం గజ ఈతగాళ్లకు జీతాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, వాచ్ టవర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చులకు రిసార్ట్స్ వారు సహకరించాలని కోరారు. ఆ తరువాత ప్రభుత్వ పరంగా ఆ పనులను కొనసాగిస్తామన్నారు. దీనిపై కొందరు పనిగట్టుకుని ఎమ్మెల్యే రిసార్ట్స్ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని నిందలు వేశారు. కొండయ్య ఆ అపనిందలకు బెదరకుండా ముందుచూపుతో తీసుకున్న చర్యల ఫలితంగా ఆదివారం నిండు ప్రాణాన్ని కాపాడగలిగారని స్థానికులు, పర్యాటకులు పేర్కొంటూ అభినందించారు. దీంతో నిందలు వేసి, అబద్ధాలు వండివార్చినవారు సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడు రోజుల కిందట ప్రస్తావించిన మాజీ మంత్రి దగ్గుబాటి

మూడు రోజుల కిందట కారంచేడులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తీరంలో నెలకొన్న పరిస్థితులు, అందుకు ఎమ్మెల్యే కొండయ్య చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. పర్యాటకుల పరిరక్షణ కోసం ఎమ్మెల్యే రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని కోరితే, అతని వ్యక్తిగత ప్రయోజనం కోసమని ఓ పత్రిక ప్రచారం చేయడం దారుణమని అన్నారు. ఈ విషయమై కూటమి నాయకులు స్పందిస్తూ నాడు ఎమ్మెల్యేపై నిందలు వేసినవారు ఇప్పుడేమంటారని ప్రశ్నిస్తున్నారు.


బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనిత (ఫైల్)


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరి వైద్య శిబిరానికి విశేష స్పందన

- 793 మందికి పరీక్షలు
- శస్త్ర చికిత్సకు 130 మంది గుర్తింపు

పర్చూరు, అక్టోబరు 6: ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన వైద్య శిబిరంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా వైద్యులు, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంప్‌నకు హాజరైన ప్రత్యేక వైద్య బృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. పరిసర గ్రామాల నుంచి 739 మంది హాజరు కాగా, పరీక్షలు నిర్వహించి 130 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం అని డాక్టర్లు నిర్ధారించారు. టీడీపీ నేతలు తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంశ్య విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు తొండెపు ఆదినారాయణ, మండలపార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, రంగయ్య చౌదరి, కామేపల్లి హరిబాబు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే ఏలూరి చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివన్నారు. లక్ష మందికి కంటి ఆపరేషన్‌లు చేయించడమే లక్ష్యంగా గత 15 ఏళ్లుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. అనంతరం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బేతపూడి సురేష్, అడుసుమల్లి శ్రీనివాసరావు, కృష్ణయ్య, అనిల్, సుధాకర్, గోరంట్ల శ్రీను పాల్గొన్నారు.

రైతు సమస్యలపై రాజీలేని పోరాటం


మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

బల్లికురవ, అక్టోబరు 6 : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బల్లికురవలో మండల రైతు సంఘ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు నాగబోయిన సింగారావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల రైతుల సమస్యల గురించి కలెక్టర్ వెంకటమురళిని కలిసి ఎరువులు రైతు సేవా కేంద్రాలలో ఉంచాలని అలానే భూములు సాగు చేస్తున్న కైలు రైతులకు రుణాలు అందించాలని, సాగర్ నీటిని వరి సాగుకు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నేతలు రాజేశ్వరరావు, పుచ్చకాయల వెంకట్రావు, బొట్లగుంట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

పంట సాగు సమయం కావడంతో రైతుల ఆందోళన


ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరును ఎత్తుకెళ్లిన దొంగలు

బల్లికురవ, అక్టోబరు 6 : చెన్నుపల్లి గ్రామంలో రైతు ముప్వా అంజయ్యకు చెందిన పంట పొలంలో శనివారం రాత్రి వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరును చోరీ చేశారు. ఆదివారం మోటార్‌ను వేసేందుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ పడవేసి ఉండడంతో చోరీ విషయం గమనించామని రైతు అంజయ్య తెలిపారు. సాగులో ఉన్న సమయంలో జరగడం తమకు నష్టమని అధికారులు వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను వేయించాలని రైతు కోరారు.

22 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మేదరమెట్ల, అక్టోబరు 6 : మేదరమెట్ల నుంచి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ మహమ్మద్ రఫీ పట్టుకున్నారు. ఆదివారం ఉదయం మేదరమెట్ల పాత చెక్ పోస్టు సెంటర్‌లో రేషన్ బియ్యంతో వెళ్తున్న ఆటోను పరిశీలించగా ఒక్కొక్కటీ 50కేజీల బరువు కలిగిన 22 బస్తాలు ఉన్నాయి. ఈ బియ్యం మేదరమెట్లకు చెందిన రేషన్ బండి ఓనర్ ఇడపలపాటి శ్రీనివాస్ నుంచి అద్దంకికి చెందిన నర్రాల శ్రీ కరుణ సారధి, ఒబ్బినీడి వీరాంజనేయులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రేషన్ బియ్యం ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కంటైనర్ లారీ బోల్తా

డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు

అద్దంకి, అక్టోబరు 6 : కంటైనర్ లారీ బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లారీ మండలంలోని కొంగపాడు డొంక సమీపంలో ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి బోల్తా పడింది. హైవే సిబ్బంది గాయపడ్డ డ్రైవర్, క్లీనర్ లను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

అద్దంకిటౌన్, అక్టోబరు 6 : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మారం వారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్, అద్దంకి, మైనంపాటి వీరరాఘవమ్మ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వేములకొండ హనుమంతరావు, గుడిపూడి అంజయ్య, యర్రమోతు వీరాస్వామి, నిమ్మరాజు నాగేశ్వరరావును ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యనే కాక, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను బోధిస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వారణాసి రఘురామశర్మ, డాక్టర్ యు.దేవపాలన, మలాది శ్రీనివాసరావు, తవనం వెంకట్రావు, డీవీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం (చీరాల), అక్టోబరు 6 : నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నన్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మోటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా బచ్చులవారిపాలెం సమీపంలోని స్కీమ్ వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ రైతులు ఉమ్మడి ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సకాలంలో సాగునీరు అందిస్తున్నామని, భవిష్యత్‌లో ఏఅవసరం వచ్చినా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఏ పంటలు సాగుచేస్తున్నారు. సాగు వ్యయం ఎంత తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, నీటి సంఘాల బాధ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తాం

డీఎస్పీ జగదీష్ నాయక్


డీఎస్పీ జగదీష్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, అక్టోబరు 6 : వృద్ధులకు వెసులుబాటు కలిగిన సంక్షేమ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని, దానిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన ప్రసంగించారు. వృద్ధులను, తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వారి అనుభవాలపై అవగాహన పొంది ముందుకు సాగాలన్నారు. అనంతరం డీఎస్పీని ఘనంగా నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వెంపరాల నారాయణమూర్తి, గాదె హరిహరరావు, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, సత్రం మల్లేశ్వరరావు, వీరప్రసాద్, రామకృష్ణ, శివాంజనేయ ప్రసాద్, సత్యం, కృష్ణమూర్తి, నిర్మల, బత్తుల బ్రహ్మారెడ్డి, నాగవీరభద్రాచారి, రామారావు, రాజ్‌వినయ్‌కుమార్, నాగమాంబ పాల్గొన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న


చల్లారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలపై డెమో ఇస్తున్న పోలీసులు

చీరాల, అక్టోబరు 6 : వాహన చోదకులకు వేగం కన్నా.. ప్రాణం మిన్న అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పోలీస్ అధికారులు పదేపదే చెప్తున్నారు. ద్విచక్ర వాహనాలైనా, మూడు, నాలుగు చక్రాల వాహనాలైనా ఏవైనా నడిపే వ్యక్తులు ప్రాథమికంగా పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై వారు డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆ జాగ్రత్తలను పరిశీలిద్దాం.. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరం. అతి వేగంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ఎక్కువ సందర్భాల్లో మోటారు సైక్లిస్టులు మృత్యువాత పడుతున్నారు. కొందరు మైనర్లు కూడా కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అతి వేగంగా ప్రయాణిస్తున్నారు. వీరంతా వాహనాలను నడిపే సమయంలో తమకోసం ఇంటి దగ్గర కుటుంబ సభ్యులు ఎదరు చూస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అధికారులు ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించేలా వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ప్రాథమికంగా టూవీలర్ అయితే హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనం అయితే సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవటం, రోడ్డు క్రాసింగ్ సమయంలో నిబంధనలను పాటించడం, అతి వేగంగా నడపకపోవడంపై జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఒక వాహన చోదకుడు తప్పు చేసినా ఆ సమయంలో ఆ ప్రదేశంలో ప్రయాణించే వాహనాలు కూడా ప్రమాదానికి గురవుతాయి. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ, మనం సురక్షితంగా ఉండడంతోపాటు తోటివారు సురక్షితంగా ఉంటారు.

పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించండి

ఇంకొల్లు, అక్టోబరు 6 : పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే అందజేయాలని సీఐటీయూ కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండుమూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగయ్య,రంగారావు, పంచాయతీ కార్మికులు రాఘవేంద్రరావు, సత్యానంద పాల్గొన్నారు.

ఆలయాల్లో నవరాత్రి శోభ




అద్దంకిలో హిమవంతినిదేవి అలంకరణలో వాసవీ మాత, దైవాలరావూరులో గాయత్రిగా, పర్చూరులో లలితాదేవిగా అమ్మవారు

అద్దంకి, అక్టోబరు 6 : దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం పలు దేవాలయాలలో అమ్మవార్లు పలు అలంకరణలలో దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు హిమవంతినిదేవిగా దర్శనమిచ్చారు. రమాసుందరి, ఉమాఅన్నపూర్ణ, నాగరాజకుమారి ఆధ్వర్యంలో 540 మంది మహిళలు లలితా సహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. 108రకాల ప్రసాదాలను ఏర్పాటు చేశారు. దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని మీనాక్షీదేవిగా అలంకరించారు. వేయి స్తంభాల గుడితో పాటు పలు దేవాలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శింగరకొండలోని గాయత్రీ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహాచండీదేవిగా అలంకరించారు.

నేడు పూజలకు హాజరు కానున్న మంత్రి

పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మేదరమెట్ల : దసర నవరాత్రి పండుగ సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకారాలలో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయానే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం దైవాలరావూరులోని శ్రీ హనుమత్‌సాయి ఉమా మహేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీ అ మ్మవారి అలంకరణలో పూజలు అందుకున్నారు. మిద్దెల డొంకలో అమ్మవారు లలితాత్రిపుర సుందరి దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. మండలంలోని వివిధ దేవాలయాలల్లో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పేరాల(చీరాలటౌన్) : దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా పేరాల జక్కావారి వీధిలో విజయ గణపతి మందిరంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రులు ఘనంగా ఆదివారం నాలుగవ రోజు జరిగాయి. దీంతో అమ్మవారికి శ్రీలలిత పరమేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరయి పూజలు చేశారు.

వీర్ల గంగమ్మకు పూజలు

బల్లికురవ : దసరా ఉత్సవాల సందర్భంగా ప్రసిద్ధ వీర్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రానైట్ క్వారీల యజమానులు, కార్మికులు పూజల్లో పాల్గొన్నారు.

పర్చూరు : శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అద్దంకి నాంచారమ్మ ఆయలంలో అమ్మవారిని శ్రీ లలితాత్రిపుర సుందరిదేవి, కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష అలంకరణ చేశారు.

ఇంకొల్లు : పరమేశ్వరీ కల్యాణమండపంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారిని లలితాత్రిపురసుందరిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమందిరంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో వీర్లగంగమ్మ


ఇంకొల్లులో లలితా దేవిగా

అన్నదాతల అభ్యున్నతే నోవా లక్ష్యం

- ఒక్కడితో మొదలై వేల మందితో ముందుకు
- రైతుల నమ్మకంతోనే నెంబర్‌వన్ స్థానం
- 700 ప్రాడక్ట్‌లతో నిరంతర సేవలు
- వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, అక్టోబరు 6 : అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా నోవా అగ్రి గ్రూప్ నిరంతరం సేవలను అందిస్తోందని నోవా వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం విజయవాడలోని హోటల్‌లో నోవా ఫ్యామిలీ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఒక్కడితో మొదలైన నోవా అగ్రి కంపెనీ వేలాది మంది ఉద్యోగులు, డీలర్లతో రైతులకు విశేషమైన సేవలను నిరంతరం అందిస్తూ దేశంలోనే అగ్రగ్రామిగా నిలిచిందన్నారు. ఒక నమ్మకం, విశ్వాసం, నిబద్ధత నేడు అన్నదాతల మదిలో నిలవడానికి ప్రధాన కారణం అని ఏలూరి అన్నారు. ఎలాంటి లాభాపేక్షా లేకుండా అన్నదాతల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పంట ఉత్పత్తులను తయారు చేస్తూ రైతన్నల మన్ననలు పొందడం అభినందనీయం అన్నారు. తనకు డాక్టర్ అవ్వాలనే కోరిక ఉండేదని కానీ అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విద్యను అభ్యసించి రైతులకు విస్తృత సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసి 2007లో హైదరాబాద్ వేదికగా నోవా కంపెనీని ప్రారంభించామన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో నాణ్యమైన ఉత్పత్తులను అందించి రైతులకు ఎంతగానో దోహదపడిదన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను అందించి బాసటగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజేష్, నేషనల్ మార్కెటింగ్ హెడ్ హర్ష, రీజనల్ మేనేజర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

సమష్టి కృషితో సత్ఫలితాలు

డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, అక్టోబరు 6 : సమష్టి కృషే, సత్ఫలితాలకు నాంది అని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఆయనను బీజేపీ యువ మోర్చా ప్రతినిధులు నాసిక శివాజీ తదితరులు డాక్టర్ కలసి మెమెంటో అందజేశారు. రాజకీయ అడుగులుపై చర్చించారు. సంయుక్త ఉమ్మడి ప్రణాళితో పనిచేద్దామని తద్వారా సానుకూల వాతావరణం ఏర్పడుతుందని మహేంద్రనాథ్ వారికి చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పింజల శైలజ, షేక్ కరీమున్ పాల్గొన్నారు.


మహేంద్రనాథ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ప్రతినిధులు



ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

దిగువ ఆయకట్టుకూ నీరివ్వాలి

● వారంలో అన్ని మేజర్ కాలువలలో పూడికతీత, చిల్లచెట్ల తొలగింపు
● తాత్కాలిక పద్ధతిలో లస్కర్‌లను నియమించాలి
● మంత్రి గొట్టిపాటి ఆదేశం

అద్దంకి, అక్టోబరు 6 : అధికారులు సమన్వయంతో పనిచేసి దిగువ ఆయకట్టుకూ నీటి విడుదల అయ్యేలా పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఏబీసీ 18వ మైలు వద్ద ఆదివారం నీటి విడుదలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు మేజర్ కాలువలలో చిల్ల చెట్లు, పూడికతో నిండిపోయి నీటి ప్రవాహం లేకుండా పోయిందని మంత్రి రవికుమార్‌కు వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి ఆయా పరిధిలోని అధికారులు అన్ని మేజర్‌లను పరిశీలించి అవసరమైన అన్నిచోట్లా ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసి వారం రోజులలో పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు స్వయంగా పర్యవేక్షించి పనులు చేయించుకోవాలన్నారు. ఏబీసీలో పల్నాడు జిల్లా పరిధిలో పలు మేజర్‌లకు తలుపులు, షట్టర్‌లు లేకపోవడంతో నీటి వృథా అవుతున్న విషయాన్ని, పలు మేజర్‌లో పొర్లిపోతున్న విషయాన్ని రైతులు రవికుమార్ దృష్టికి తీసుకు రాగా, అవసరమైన చోట్ల తలుపులు, షట్టర్‌లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికడతామన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలతో పాటు అద్దంకి నియోజకవర్గంలోని దిగువ ఆయకట్టుకు కూడా నీటి విడుదల జరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏబీసీ హెడ్ వద్ద 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించడంతో పాటు బాపట్ల జిల్లా సరిహద్దు 18వ మైలు వద్ద 1,200 క్యూసెక్కులు విడుదలయ్యేలా దిగువ ఆయకట్టుకు సరిపడా నీటి విడుదలకు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి విడుదలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వ్యవహరించాలన్నారు. అద్దంకి డివిజన్‌లో 125 మంది లస్కర్‌లు ఉండాల్సి ఉండగా, 20 మంది మాత్రమే ఉన్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి వెంటనే ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడారు. తాత్కాలిక పద్ధతిన లస్కర్‌లను నియమించాలన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల ఏర్పాటు పనుల గురించి ఈఈ అబుత లేమ్‌తో చర్చించారు. ఇప్పటికే 10 గేట్ల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన రెండు గేట్ల పనులు పూర్తవుతాయని ఈఈ వివరించారు. నెలాఖరు నాటికి 1.8టీఎంసీల నీరు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నింపుతామన్నారు. వచ్చేనెలలో పూర్తిస్థాయిలో నింపి ఆయకట్టుకు నీరందిస్తామని తెలిపారు. రైతులకు పరిహారం అందించి చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేస్తామని రవికుమార్ అన్నారు. భవనాసి రిజర్వాయర్ పనులు కూడా వేగవంతం చేస్తామని చెప్పారు. లింగంగుంట్ల మానిటరింగ్ ఈఈ మల్లికార్జున, సంతగుడిపాడు, సంతమాగులూరు, అద్దంకి డీఈలు రామారావు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఏఈలు వేణు, అనిల్, ప్రతిమ, విశ్వమోహన్, క్రాంతి, సునీల్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. అడవిపాలెంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేయించాలని గ్రామస్థులు రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు.



వాడరేవు సముద్ర తీరంలో పర్యాటకులు

తీరంలో పర్యాటకుల సందడి

చీరాల, అక్టోబరు 6 : ఇటీవల కాలంలో వీకెండ్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి సామాన్య ప్రజల వరకు ఆటవిడుపుగా తీరప్రాంతాలకు కుటుంబ సమేతంగా వస్తున్నారు. స్నేహితులతో వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. శని, ఆది వారాల్లో తీరప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. చీరాల మండలం వాడరేవు, వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, చినగంజాం మండలం మోటుపల్లికి పర్యాటకులు వస్తుంటారు. అయితే కొన్ని చోట్ల పర్యాటకులకు సముద్రస్నానాలు చేసిన అనంతరం దుస్తులను మార్చుకునేందుకు ప్రత్యేక వసతులు లేవు. ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

నేటి నుంచి కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు

● ఒకే రోజు అన్నికేంద్రాల్లో ప్రారంభం
● 105 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
దక్షిణాది రీజియన్లలో రెండు రోజుల్లో ముగియనున్న మార్కెట్



ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ప్రస్తుత సీజన్ (2024-25) పొగాకు కొనుగోళ్లు సోమవారం నుంచి మొదలుకానున్నాయి. అక్కడ మొత్తం పది వేలం కేంద్రాలు ఉండగా అన్ని చోట్లా ఒకేరోజున ప్రారంభిస్తున్నారు. గత రెండేళ్ల కర్ణాటకలో ఇచ్చిన అనుమతికన్నా పంట ఉత్పత్తి తగ్గింది. 2022-23లో 100 మిలియన్ కిలోలకు 60మిలియన్ కిలోలు మాత్రమే ఉత్పత్తి అయింది. 2023-24లో కూడా వంద మిలియన్ కిలోలకు అనుమతివ్వగా 80 మిలియన్ కిలోలు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లోనూ 100 మిలియన్ కిలోలకే పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 105 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా వేస్తున్నారు. అంటే గత ఏడాది కన్నా సుమారు 25 మిలియన్ కిలోలు అంతకు ముందు ఏడాది కన్నా 45 మిలియన్ కిలోలు అధికమైనట్లు సమాచారం. కాగా గతం కన్నా పంట ఉత్పత్తి కొంత పెరగడంతోపాటు నాణ్యత అంతగా లేదని తెలుస్తోంది. దాని ప్రభావం ధరలపై చూపే అవకాశం ఉంది. గత ఏడాది తొలి రోజున కిలో గరిష్ఠ ధర రూ.240తో ప్రారంభించిన వ్యాపారులు క్రమంగా పెంచుతూ కిలోకు రూ.292 ఇచ్చారు. అలాగే అత్యల్ప ధర కిలో రూ.200 పలికింది. సగటున కిలోకు రూ.259.22 ధర లభించింది. ఈసారి ప్రారంభ ధరను అక్కడి రైతులు కిలోకు రూ.275 కోరుతున్నట్లు తెలుస్తుండగా వ్యాపారులు రూ.250తో ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా రాష్ట్రంలో దక్షిణాది రీజియన్లలో పొగాకు మార్కెట్ మరో రెండు, మూడు రోజుల్లో ముగియనుంది. ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్లలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11వేలం కేంద్రాలు ఉండగా ఇప్పటికే ఎనిమిది చోట్ల కొనుగోళ్లు ముగిశాయి. సోమవారం రెండింటిలో, బుధవారం మరో రెండింటిలో పూర్తికానున్నాయి.

మా ప్రాంతంలో మావారే!

మద్యం దుకాణాలపై ప్రధాన పార్టీ దృష్టి
నియోజకవర్గాల వారీగా సిండికేట్
ధిక్కరించే వారికి నేతల బెదిరింపులు
మా అండలేకుండా వ్యాపారం చేయలేరని హెచ్చరికలు
కొన్నిచోట్ల బేరాలు
ఆదాయంలో వాటాలకు సెటిల్మెంట్లు
వెనకడుగు వేస్తున్న వ్యాపారులు
111 దుకాణాలకు ఇప్పటి వరకూ అందింది 229 దరఖాస్తులే
రెండ్రోజుల్లో ముగియనున్న గడువు



సంతనూతలపాడు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలోని ముఖ్యనేత మద్యం ఆదాయంపై కన్నేశారు. వ్యాపారులను ముందే గుర్తించి వారిని తన గుప్పెట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. దుకాణాన్ని ఎవరు దక్కించుకున్నా మా సహకారం లేకుండా మీరు వ్యాపారం చేయలేరని హెచ్చరికలు జారీ చేసి దారికి తెచ్చుకుంటున్నారు.

దర్శి నియోజకవర్గంలో అధికార కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన నేత బంధువు ఒక అడుగు ముందుకేశారు. 'ఎవరూ తొందరపడి డబ్బులు పోగొట్టుకోకండి. నేను చెప్పిన వాళ్లే దరఖాస్తు చేసుకోండి. మిగిలిన వారికి వ్యాపారంలో వాటా ఇప్పిస్తా' అని సిండికేట్‌కు సిద్ధమయ్యారు.

పై రెండు నియోజకవర్గాలే కాదు. మార్కాపురం, ఒంగోలుతోపాటు పలు సెగ్మెంట్లల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికార కూటమి నేతలు మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మలుచుకుంటున్నారు. కుదిరితే దుకాణాలను దక్కించుకోవడం.. లేకపోతే తమ అనుచర గణానికి వచ్చేలా చేయడం.. అదీ సాధ్యపడకపోతే ఆశావహులను నయానో భయానో దారికి తెచ్చుకొనైనా వాటాను దక్కించుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. దరఖాస్తుదారులు ఎవరైనా ఈ సిండికేట్‌కు సిద్ధపడకుంటే నేతల నుంచి హెచ్చరికలు.. బెదిరింపులు పెరుగుతున్నాయి. దీనికి భయపడి చాలా మంది వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా దరఖాస్తుల సంఖ్య చాలా తగ్గింది. మరో రెండ్రోజుల్లో గడువు ముగియనుండటంతో ఔత్సాహిక వ్యాపారులపై బెదిరింపులు మరింత తీవ్రమయ్యాయి.

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ కూటమి నేతలు దృష్టి సారించారు. వారి అండ లేకుండా వ్యాపారం చేయడం కష్టమని అనేకమంది వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ మద్దతుదారులుగా గుర్తింపు ఉన్నవారు, అధికార పార్టీలోని ముఖ్యనేతల అండదండలు అంతగా లేనివారు దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు వెనుకాడుతున్నారు.

వ్యాపారులకు 20 శాతం కమీషన్

గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. అనామక బ్రాండ్లతో అమ్మకాలు చేపట్టి అభాసుపాలైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పు తెచ్చింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన విధానాన్నే తిరిగి అమల్లోకి తెచ్చింది. బహిరంగంగా దరఖాస్తులకు ఆహ్వానం పలికింది. లైసెన్సు ఫీజులు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు దుకాణాల ఏర్పాటుకు అనుమతులిచ్చింది. వ్యాపారులకు కమీషన్ పెంచింది. గతంలో 13 శాతం కమీషన్ ఇవ్వగా ఇప్పుడు 20 శాతానికి పెంచింది. పట్టణాలు, మండలాలు యూనిట్‌గా దుకాణాలు ప్రకటించి ఆ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. జిల్లాలో 171 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో అర్బన్ ప్రాంతాలు, వాటికి సమీప మండలాల్లో ఏడాదికి రూ.65 లక్షలు, ఇతర మండలాల్లో రూ.55 లక్షలు లైసెన్సు ఫీజుగా ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం జిల్లాలో 120 దుకాణాలు రూ.65 లక్షలు, 71 దుకాణాలకు రూ.55 లక్షల చొప్పున లైసెన్సు ఫీజు చెల్లించాలి. అయితే దరఖాస్తు చేసే ప్రతి ఒక్కరూ ఒక్కో దుకాణానికి రూ.2లక్షలు ఫీజు చెల్లించాలి. ఎవరు ఎన్ని దుకాణాలకు అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తు ఫీజును వాపసు ఇవ్వరు. ఆ మేరకు నోటిఫికేషన్ ఇచ్చి ఈనెల 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

ఆదాయంపై కూటమి నేతల కన్ను

నూతన మద్యం పాలసీలో ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు ఇవ్వడం ద్వారా దరఖాస్తు ఫీజు రూపంలోనే సగటున ఒక్కో షాపునకు రూ.కోటి వర కూ పొందాలన్నది ప్రభుత్వ ఆలోచన. అయితే జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. తాజా విధానంలో వ్యాపారి కమీషన్ 20 శాతానికి పెంపు, లైసెన్సు పొందిన దుకాణాన్ని ఆ పట్టణం లేదా మండలంలో వ్యాపారి తన ఇష్టం ఉన్నచోట ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పించడంతో లాభాలు వస్తాయన్న ఆశలు పెరిగాయి. దీంతో అధికార కూటమి నేతల ఈ వ్యాపారంపై కన్నేశారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుతం అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధులకు గతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్యం వ్యాపారంతో సంబంధాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల ద్వితీయ శ్రేణి నేతల్లో అలాంటి వారున్నారు. దీంతో వివిధ ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు.

ఆశావహులకు హెచ్చరికలు

మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేస్తారన్న అనుమానం ఉన్న వారికి ప్రధాన పార్టీ నేతల నుంచి పరోక్షంగా హెచ్చరికలు వెళుతున్నాయి. 'మా ప్రాంతంలో మేమే లేదా మావాళ్లు వ్యాపారం చేసుకుంటారు. మాకు తెలియకుండా ఎవరూ దరఖాస్తులు చేయొద్దు. కాదని ఎవరైనా దరఖాస్తు చేసి షాపు దక్కించుకున్నా వ్యాపారం చేయలేరు' అని హెచ్చరిస్తున్నారు.

● మార్కాపురం, దర్శి, కనిగిరి, సంతనూతలపాడు, నియోజకవర్గాల్లో ఈ తరహా హెచ్చరికలు వెళ్లాయని ప్రచారం జరుగుతోంది.

● ఇంకొన్ని నియోజకవర్గాల్లో ముందుగా ఇలాంటి హెచ్చరికలు చేసి ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకోవడం కన్నా దుకాణాల లైసెన్సులు పొందినవారు మన సహకారం లేకుండా వ్యాపారం చేయలేరు కాబట్టి అప్పుడు చూసుకుందామని వేచిచూసే ధోరణిలో ఉన్నట్టు తెలిసింది.

● కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలే పోటీ పడి దరఖాస్తు చేసుకొనే పరిస్థితి ఉండటంతో భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ముందుగానే వారిని సిండికేట్ చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. వీటన్నింటి ప్రభావం మద్యం దుకాణాలకు దరఖాస్తులపై పడుతోంది.

మందకొడిగా దరఖాస్తులు

ఈనెల 1 నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ఆశించిన స్పందన రావడం లేదు. జిల్లాలో 171 దుకాణాలకు నోటిఫికేషన్ ఇస్తే ఆదివారం సాయంత్రానికి 111 దుకాణాలకు 229 దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటి ద్వారా రూ.4.58 కోట్ల మేర ఆదాయం వచ్చినట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ యస్.కె.ఖాజామొహిద్దీన్ తెలిపారు. 60 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 9వ తేదీ సాయంత్రంతో ముగియనుంది. వాటి పరిశీలన 10న ఉంటుంది. 11న దుకాణాల కేటాయింపునకు ఒంగోలులో లాటరీ తీస్తారు. దుకాణం పొందినవారు 12వ తేదీ నుంచి వ్యాపారం ప్రారంభించుకొనేలా షెడ్యూల్ రూపొందించారు.

కొనసాగుతున్న వసూళ్ల పంచాయితీ

పైసలిస్తేనే గ్రేడ్-5,6 ఉద్యోగులకు పోస్టింగ్
ఒక్కొక్కరి వద్ద రూ.30 వేల నుంచి రూ.50వేలు వసూలు
అక్రమాలపై కలెక్టర్ అన్సారియా ఆరా
అయినా మారని అధికారి తీరు
కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 6 : గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. పైసలు తీసుకొని పోస్టింగ్‌లు ఇస్తున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈ విషయమై కలెక్టర్ అన్సారియా ఆరా తీసినప్పటికీ ఆశాఖ అధికారులు, ఉద్యోగులు తీరు మాత్రం మారడం లేదు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'వసూళ్ల పంచాయితీ' శీర్షికన ప్రచురితమైన కథనం కలకలం రేకెత్తించింది. అయినప్పటికీ ఆ శాఖ అధికారి మాత్రం ఒక్కో పోస్టుకు రేటు నిర్ణయించి ఇద్దరు ఉద్యోగుల ద్వారా వసూళ్ల పర్వం కొనసాగించడాన్ని బట్టి చూస్తే ఎంతకు బరి తెగించారో అర్థమవుతుంది.

ఇద్దరు ఉద్యోగుల కీలక పాత్ర

వసూళ్ల విషయంలో ఇద్దరు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవల వరకూ జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేసి రిలీవ్ అయిన ఒక ఉద్యోగి తోపాటు, కార్యాలయంలో సదరు సెక్షన్‌లో పనిచేసే మరో ఉద్యోగి వసూల్ రాజాల అవతారం ఎత్తినట్లు సమాచారం. అడిగినంత ఇస్తేనే బదిలీ అర్డర్ చేతిలో పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో నెల క్రితం గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినా ఇంత వరకూ పోస్టింగ్‌లు ఇవ్వలేకపోయారు. ఒక్కో ఉద్యోగి రూ.30 వేల నుంచి రూ.50 వేలు చెల్లిస్తేనే బదిలీ ఉత్తర్వులు ఇస్తున్నట్లు సమాచారం. ఆరెండు విభాగాల్లో సుమారు 500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. దీంతో వారి వద్ద నుంచి భారీ మొత్తంలో రాబట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల అధికారికి అందని సమాచారం

సాధారణ బదిలీలు అయితే వెంటనే ఆ అర్డర్లను సంబంధిత ఉద్యోగికి ఇవ్వడంతో పాటు మండల స్థాయి అధికారికి మెయిల్ ద్వారా సమాచారం పంపించాల్సి ఉంది. కానీ అవి దంగా చేస్తే ఉద్యోగులు ఆఫీసుకురారని, తమకు అమ్యామ్యాలు అందవన్న కారణంతో వాటిని సదరులు వసూల్ రాజాలు తమ వద్దనే పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. అదేసమయంలో ఆర్డర్లు బయట పెడితే ప్రజాప్రతినిధులు చేసిన సిఫార్సుల ప్రకారం బదిలీలు చేయని విషయం బహిర్గతమై ఇబ్బందులు ఎదురవుతాయన్న మరో కారణంతో కూడా వారు జాగ్రత్త పడుతున్నారు. మొత్తం మీద అటు ప్రజాప్రతినిధుల నుంచి ఇబ్బందులు లేకుండా, ఇటు తమ జేబులు నిండేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఒక కీలక ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలోని గ్రేడ్-5 ఉద్యోగిని నియమించాలని సిఫార్సు చేశారు. కానీ ఆయన చెప్పిన పేరు కాకుండా మరొకరిని ఆ పోస్టులో నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



జిల్లా పంచాయతీ కార్యాలయం

ఎక్సైజ్‌లో బదిలీల రగడ

● గడువు ముగిసిన తర్వాత 18 మందితో జాబితా సిద్ధం
● అడ్డం తిరిగిన ఓ సీఐ ● ఒత్తిడి పెంచుతున్న ప్రజాప్రతినిధులు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 6 : ఎక్సైజ్ శాఖలో బదిలీల రగడ నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు గతనెల 30తో ముగియగా, ఇప్పుడు పాత తేదీలు వేసి 18 మందితో జిల్లా అధికారి జాబితాను సిద్ధం చేయడం వివాదాస్పదమైంది. ఓ సీఐ ఎదురుతిరడంతో ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎక్సైజ్ శాఖలో హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బదిలీల్లోనూ ఈసారి రాజకీయ జోక్యం శ్రుతిమించింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండా వారిని అధికారులు కదిలించలేకపోయారు. విధిలేని పరిస్థితుల్లో కొందరిని వారు అడిగిన చోటుకు బదిలీ చేయలేకపోయారు. దీంతో ఎక్సైజ్ అధికారులపై రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఈనేపథ్యంలో ఆ శాఖ జిల్లా అధికారి 18 మందితో ఒక జాబితాను సిద్ధంచేసి గత నెల 30వతేదీ లోపే పోస్టింగ్‌లు ఇచ్చినట్లు లేఖను కూడా తయారు చేశారు. అయితే ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎదురు తిరిగారు. బదిలీలను అడ్డుకున్నారు. తన స్టేషన్‌లో ఆరుగురు పని చేస్తున్నారని, వారిలో ముగ్గురిని బదిలీ చేస్తే అంతే సంఖ్యలో సిబ్బందిని ఇవ్వాలని భీష్మించారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టడాన్ని ఆయన ఆక్షేపించినట్లు తెలిసింది. దీంతో ఎక్సైజ్ అధికారులు వెనకడుగు వేసి జాబితాను గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

స్వర్ణాంధ్రపై రేపు ప్రజాప్రతినిధులతో సమావేశం

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై మంగళవారం జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరగనుంది. వికసిత భారత్-2047 పేరుతో కేంద్రం, స్వర్ణాంధ్ర పేరుతో రాష్ట్రప్రభుత్వాలు విజన్ డాక్యుమెంట్లు రూపొందిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికను నవంబరు1న విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించి వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలను తీసుకుంటున్నారు. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో కీలక ప్రజాప్రతినిధులతో ఈనెల 8న జిల్లాస్థాయి సమావేశాన్ని కలెక్టర్ అన్సారియా ఏర్పాటు చేశారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో ఈ సమావేశం జరగనుంది.



మృతిచెందిన రాజశేఖర్

పోలీసుల వేధింపులకు యువకుడి బలి

ఐదు రోజుల క్రితం ఎలుకల మందు తిన్న రాజశేఖర్
చికిత్స పొందుతూ మృతి
న్యాయం చేయాలని బంధువుల ఆందోళన
వీఆర్‌కు ఏఎస్సై, కానిస్టేబుల్

ఒంగోలు (క్రైం), అక్టోబరు 6 : పోలీసుల వేధింపులు ఓ యువకుడి ప్రాణం తీశాయి. విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి హింసించడంతో ఈనెల 2న ఎలుకల ముందుతిన్న పరుచూరి రాజశేఖర్ (36) ఆదివారం మృతి చెందారు. దీంతో న్యాయం కోరుతూ ఆయన బంధువులు వైద్యశాల వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని సమతానగర్‌లో నివాసం ఉండే రాజశేఖర్ కొత్తపట్నం మండలం మడనూరులోని వింటోస్ హేచరీస్‌లో 2020 నుంచి 2022 వరకూ మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో లావాదేవీల్లో అక్రమాలు జరిగాయని రెండేళ్ల తర్వాత హేచరీస్ యజమాని సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎలాంటి కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో రాజశేఖర్‌ను ఒంగోలు టూటౌన్ స్టేషన్‌కు పిలిపించి వేధించినట్లు ఆయన భార్య అంజలి ఆరోపించారు. తన భర్తపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో ఆయన ఈనెల 2న ఎలుకల ముందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడని రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులకు ఆమె అదే రోజు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న రాజశేఖర్ ఆదివారం మృతి చెందారు. తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో హేచరీస్ యజమాని సుధాకర్, మృతుడి బంధువుల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం వారు ఆందోళన విరమించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎనిమిది పేజీల సూసైడ్ నోట్

ఈనెల 1న స్టేషన్‌కు వెళ్లి వచ్చిన అనంతరం పోలీసులు చేసిన అవమానం, వేధింపులపై రాజశేఖర్ ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ డైరీలో రాసినట్లు బంధువులు తెలిపారు. అయితే హేచరీస్ యజమానితో చర్చలు ఫలప్రదం కావడంతో ఈనోట్‌ను బయట పెట్టలేదు. పోలీసులు కూడా సూసైడ్ నోట్ విషయాన్ని నిర్ధారించలేదు. రాజశేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించి వేధించి, హింసించి అంగీకారపత్రం రాయించుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒంగోలు టూటౌన్ ఏఎస్సై చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై ఎస్పీ దామోదర్ చర్యలు తీసుకున్నారు. వారిద్దరినీ వీఆర్‌కు పిలిచారు.

దసరా మామూళ్ల దడ / ప్రజల బెంబేలు

కట్టడి చేయాలని వేడుకోలు

అద్దంకి, అక్టోబరు 6 : దసరా వస్తుందంటే కొంతమందికి సరదా... అయితే..అత్యధిక శాతం మంది ప్రజలు బెంబేలెత్తే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా గ్రామాల కంటే పట్టణాలలోని ఉండే కుటుంబాలకు దసరా పండుగ వచ్చిందంటే నెలలో కనీసం రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు భారం పడే పరిస్థితి నెలకొంది. చోటామోటా నాయకులకు అయితే దసరా మామూళ్ల రూపేణా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు మామూళ్ల రూపంలో సమర్పించుకోవాల్సిందే. ఒకప్పుడు దసరా అంటే ఉపాధ్యాయులు, విద్యార్థులకు పండుగ. అయ్యవారికి చాలు ఐదు వరహాలు.. పిల్లవాండ్రకు చాలు పప్పు బెల్లాలు అంటూ ఇంటింటికీ తిరిగేవారు.. ఆ పరిస్థితి మూడు నాలుగు దశాబ్దాల కిందటే పోయింది. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్టేషన్‌లవారీగా వేలం పాటలు నిర్వహించి దసరా మామూళ్లను వసూలు చేసే వారు. దశాబ్ద కాలంగా ఈ పరిస్థితి తగ్గింది. ఈ జాడ్యం మిగతా ప్రభుత్వ, ప్రైవేట్ శాఖలకు పాకింది. మెకానిక్ షెడ్‌లు మొదలు మున్సిపల్ సిబ్బంది వరకు అందరూ మామూళ్ల కోసం వెంట పడే పరిస్థితి వచ్చింది. ప్రధానంగా మున్సిపాలిటీలో విభాగాలవారీగా దసరా మామూళ్లను వసూలు చేస్తుండడంతో సామాన్య కుటుంబాలు బెంబేలెత్తుతున్నారు. పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, విద్యుత్ విభాగం ఇలా ఎవరికివారే మామూళ్లను వసూలు చేస్తున్నారు. ఇక మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలలో కిందిస్థాయి సిబ్బంది కూడా మామూళ్ల కోసం వెంటపడుతున్నారు. అదే సమయంలో దుకాణాలలో పనిచేసే సిబ్బంది తమ యజమానితో పాటు కస్టమర్ల వద్ద కూడా మామూళ్లు అడగడం ప్రారంభించారు. ఇలా అద్దంకి పట్టణంలో ఒక్కో కుటుంబం కనీసం రూ.2వేల నుంచి రూ.5వేల వరకూ ఇచ్చుకోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఒక స్థాయి గుర్తింపు ఉన్న నాయకులైతే రూ.50వేల నుంచి రూ.లక్ష సమర్పించుకున్నట్లు తెలిపారు. మామూళ్లు ఇవ్వకపోతే సదరు ఆఫీసు వైపు వెళ్లినప్పుడు సరైన గుర్తింపు ఉండదనే భావనతో ఇస్తున్నామని అంటున్నారు. గతంలో అంటే జీతాలు తక్కువగా ఉన్న రోజులలో మామూళ్లు వసూలు చేయడంలో అర్థం ఉందని, ఇప్పుడు కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బంది లేని విధంగా జీతాలు ఉన్నాయని, ఈ పరిస్థితిలో మామూళ్లు వసూలు చేయకపోవడమే గౌరవంగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి మామూళ్ల వసూళ్లను కట్టడి చేయాలని, అదే సమయంలో ప్రైవేటు వ్యక్తులు కూడా దసరా మామూళ్ల పేరుతో పీడించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

FLAT FOR SALE

■ 2 BHK, 1278 SFT, 502, ANJANEYA ENCLAVE, BHAGYA NAGAR, 4th Lane, Opp. Andhra Pragati Grameen Bank, Ongole - 523001, Contact - P. Radha Krishna, 9373282002 / 8999790130.

AJO-190375

జ్యోతిష్యాలయం

■ ఆదిశక్తి రేణుక ఎల్లమ్మ తల్లి జ్యోతిష్యము చెప్పబడును. ప్రేమ, పెళ్లి, సంతానం, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఏ సమస్యలైన పరిష్కారం చెప్పబడును. సంప్రదించు G.కృష్ణంరాజు, R.T.C.బస్టాండు దగ్గర, ఒంగోలు, సెల్: 9640409458

AJO-200161

ప్లాట్లు అమ్మబడును

■ ఒంగోలు కార్పొరేషన్ లిమిట్స్‌లో అన్ని వసతులతో ఓపెన్ ప్లాట్స్ మరియు DTCP అప్రూవడ్ ప్లాట్లు కలవు. KR డెవలపర్స్. సెల్ : 8499816663.

AJO-200074

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k. Ph:9640258899, 9640468899

AJH-15274

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు
వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు
లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్రః 9985411484


కావలి: భువనేశ్వరీదేవిగా దుర్గాభ్రమరాంబ

నెల్లూరు: అన్నపూర్ణాదేవిగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు

నిత్యానందకరీ.. వరాభయకరీ !



జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకి చేరాయి. ఈ సందర్భంగా దుర్గాదేవిని, మహాలక్ష్మీ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నెల్లూరులోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి అన్నపూర్ణదేవి అలంకారం జరిగింది. ఎస్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ కుటుంబంతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్ కూడా రాజరాజేశ్వరిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా రాజరాజేశ్వరిగా వాసవీ కన్యకా పరమేశ్వరి, భవానీగా ఇరుకళల పరమేశ్వరి, అన్నపూర్ణగా భువనేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

- నెల్లూరు (సాంస్కృతికం)


సంగం: నాణేల అలంకారంలో గంగమ్మ తల్లి


వరికుంటపాడు: కుష్మాండ దుర్గాదేవి అలంకరణలో మానసాదేవి


నెల్లూరు: భవానీ అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి


కందుకూరు: లలితా త్రిపురసుందరీ అలంకారంలో కనకదుర్గ అమ్మవారు


బుచ్చి: మధుకైటభవధ అలంకారంలో జొన్నవాడ కామాక్షితాయి


నెల్లూరు: గాజుల అలంకరణలో కన్యకా పరమేశ్వరి

పండక్కి పప్పన్నం లేనట్టే !

- చౌకదుకాణాలకు అరకొరగా కందిపప్పు సరఫరా
- అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు



ఉదయగిరి రూరల్, అక్టోబరు 6 : చౌకదుకాణాలకు పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ప్రతినెలా జిల్లాలోని చౌక దుకాణాలకు అరకొరగానే కందిపప్పు సరఫరా చేస్తున్నారు. దీంతో డీలర్లు కొంతమంది లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్టోబరులో దసరా, దీపావళి పండుగలు ఉన్న నేపథ్యంలో కార్డుదారులకు తప్పనిసరిగా కందిపప్పు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దీంతో కార్డుదారులకు పండక్కి పప్పన్నం కరువైందని చెప్పాలి.

అరకొరగా సరఫరా

ఉదయగిరి సివిల్ సప్లయ్ గోదాము పరిధిలో ఉదయగిరి, మర్రిపాడు, సీతారామపురం, వరికుంట పాడు మండలాల్లో 41,230 మంది కార్డుదారులు ఉన్నారు. ఉన్నతాధికారులు అక్టోబరు నెలకు సంబంధించి 15 టన్నుల(15 వేల ప్యాకెట్లు) మాత్రమే సరఫరా చేశారు. ఒక్కో చౌక దుకాణంలో సుమారు 350 కార్డులు ఉండగా 100 మందికి మాత్రమే కందిపప్పు పొట్లాలు పంపిణీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో కందిపప్పు రూ.160లు పలుకుతోంది. చౌకదుకాణాల ద్వారా అయితే రూ.67లకు ఇస్తున్నారు. దీంతో పేదలు అధికంగా కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు. అయితే దుకాణాలకు అరకొరగా సరఫరా చేయడం, కొందరికే ఇవ్వడంతో కార్డుదారులు మండిపడుతున్నారు. కొంతమంది డీలర్లు కందిపప్పు ఉన్నా తక్కువ ఇచ్చారని, అయిపోయిందని సమాధానం చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు డీలర్లతో వాగ్వివాదానికి దిగుతున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో కందిపప్పు సరఫరా చేసి అందరికీ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కార్డుదారులు కోరుతున్నారు.

ఇసుక అక్రమాలకు కళ్లెం

- బుకింగ్‌లో ట్రాన్స్‌పోర్టర్ల మాయాజాలానికి బ్రేక్
- 'సొంత వాహనం' ఆప్షన్ తొలగింపు
- ఏ రోజుకారోజు బుకింగ్‌కు అవకాశం
- బల్క్ బుకింగ్ ప్రారంభించిన అధికారులు

నెల్లూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక పాలసీ మాటున అక్రమాలకు పాల్పడుతున్న ట్రాన్స్‌పోర్టర్లకు ప్రభుత్వం బ్రేకులు వేసింది. ఇసుక బుకింగ్ పోర్టల్‌లో ఉన్న లూప్‌హోల్స్‌ను ఉపయోగించుకొని మొత్తం ఇసుకను దొంగ పేర్లతో బుకింగ్ చేసుకుంటున్న మాయాజాలానికి కళ్లెం వేసింది. ఇకపై ఎవరి ఇసుక వారే బుకింగ్ చేసుకునేలా, ట్రాన్స్‌పోర్టర్లు బుకింగ్ చేసి అధిక ధరలకు విక్రయించే వీలు లేకుండా శాండ్ పోర్టల్‌లో మార్పులు చేసింది. ఉచిత ఇసుక పాలసీలో ఉన్న లోపాలను, ట్రాన్స్‌పోర్టర్లు చేస్తున్న అక్రమాలను, ప్రజలు పడుతున్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరుస కథనాలతో వెలుగులోకి తీసుకువచ్చింది. గత నెల 27న 'బల్క్ బుకింగ్‌లు ఎప్పుడు..?' అన్న శీర్షిన కథనం, 29న 'ఉచిత ఇసుక పాలసీకు గండి' శీర్షికన మరో కథనం, 30న 'అంతా మాయ' శీర్షికన ఇంకో కథనాన్ని ప్రచురించింది. బల్క్ బుకింగ్‌లు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ వర్కులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీని మూలంగా ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. అలానే ట్రాన్స్‌పోర్టర్లు కుమ్మక్కై శాండ్ పోర్టల్‌లో మొత్తం ఇసుకను వారే బుకింగ్ చేసేస్తూ వచ్చారు. ఇక మైనింగ్ అధికారుల తీరు కూడా అక్రమార్కులకు బాగా సహకరించింది. పగలు బుకింగ్‌కు పోర్టల్ ఓపెన్ చేస్తే సామాన్యులు బుకింగ్ చేసుకుంటారు. అలా కాకుండా వారం మొత్తానికి ఒకే రోజు బుకింగ్‌కు అవకాశం ఇస్తూ అది కూడా అర్ధరాత్రి వేళ పోర్టల్ ఓపెన్ చేస్తుండడంతో తెల్లవారే సరికి ఆ ఇసుకంతా ట్రాన్స్‌పోర్టర్ల ఖాతాలోకి వెళ్లిపోయేది. తద్వారా రూ.10 వేలకు దొరకాల్సిన ట్రిప్పర్ ఇసుక ధర రూ.20 వేలకు తక్కువ దొరికేది కాదు. దీంతో ఉచిత ఇసుక పాలసీ ఫలితాలు సామాన్యులకు అందలేదు. 'ఆంధ్రజ్యోతి' కథనాలతో స్పందించిన ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో ఉచిత ఇసుక పాలసీ అమలుపై సమీక్షించింది. జిల్లా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంది. వాటన్నింటినీ పరిశీలించాక బుకింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంది. శాండ్ బుకింగ్ పోర్టల్‌లో మార్పులు చేసింది. ఇప్పటి వరకూ బుకింగ్ సమయంలో ఓన్ వెహికల్ (సొంత వాహనం) ఆప్షన్ ఉండగా.. దానిని ఉపయోగించుకుంటూ దొంగ పేర్లతో ట్రాన్స్‌పోర్టర్లు తమ వాహనాలను అక్కడ రిజిస్టర్ చేస్తూ ఇసుకను బుకింగ్ చేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు ఆ ఆప్షన్ తీసేయడంతో శాండ్ పోర్టలే రవాణాకు ర్యాండమ్‌గా వాహనాలను ఎంపిక చేస్తుంది. అప్పుడు బుకింగ్ చేసిన వారికి, ట్రాన్స్‌పోర్టర్‌కు సంబంధం ఉండదు. దీని ద్వారా ట్రాన్స్‌పోర్టర్లు చేసే అక్రమాలకు బ్రేక్ పడింది. ఇక ఇసుక బుకింగ్ వేళల్లో కూడా మార్పు లు చేసింది. ఇప్పటి వరకూ మైనింగ్ అధికారులు అర్ధరాత్రి వేళల్లో వారానికి ఒక రోజు బుకింగ్ పోర్టల్ ఓపెన చేస్తుండగా, ఇకపై ప్రభుత్వ పనివేళల్లో బుకింగ్ పోర్టల్ ఓపెన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలానే వారానికి ఒక రోజు కాకుండా ఏ రోజుకు ఆ రోజు బుకింగ్‌కు పోర్టల్ ఓపెన్ చేయాలని సూచించింది. దీంతో శుక్రవారం, శనివారాల్లో మధ్యాహ్నం వేళల్లో బుకింగ్ పోర్టల్ ఓపెన్ అయ్యింది. అలానే ప్రభుత్వ వర్కులు, అపార్ట్‌మెంట్లకు ఇబ్బందులు లేకుండా బల్క్ బుకింగ్‌ను కూడా ప్రారంభించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బల్క్ బుకింగ్‌లకు జిల్లా అధికారులు గత రెండు రోజులుగా అనుమతులు ఇస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా ట్రిప్పర్ ఇసుక ధర రూ.20 వేల నుంచి రూ.15 వేలకు తగ్గినట్లు వ్యాపార వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బల్క్ బుకింగ్ ఎప్పుడు?


అంతా మాయ!


ఉచిత పాలసీకి గండి

గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు




రంగడిసేవలో ఎన్నికల అధికారి

నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. కాగా, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం రంగనాథస్వామి ఆలయంలో తిరుమంజనం సేవలు, సాయంత్రం విశేష పూజలు, శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి, రంగనాయకమ్మకు ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ నిర్వహించారు. - నెల్లూరు (సాంస్కృతికం)

ఉత్తరక్రియలు

మా తండ్రి గారైన శ్రీ దండు సుబ్రమణ్యం గారు
తేది: 18-09-2024 బుధవారం స్వర్గస్థులైనారు.

పెద్దకర్మ
తేది:10-10-2024 గురువారం ఉదయం 10 గంటలకు నెల్లూరు బాలాజీనగర్, హెచ్.పి.గ్యాస్ గోడౌన్ వద్ద మా స్వగృహము నందు పెద్దకర్మ జరుగును. కావున తెలియజేయడమైనది.


కీ॥శే॥ దండు సుబ్రమణ్యం గారు
Rtd. UCO Bank Head Cashier, Nellore

శోకతప్త హృదయాలతో...
కుమారుడు : దండు ప్రవీణ్‌కుమార్
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు

మమతానురాగాలకు మారుపేరై, అప్యాయత, అనుబంధాలతో మమ్మల్ని అలరించిన అమృతమూర్తి మా తల్లి గారైన
శ్రీమతి పెరమన సుజాతమ్మ గారు
(కీ॥శే॥ గోపాల్ రెడ్డిగారి భార్య)
తేది 29-9-2024 ఆదివారం స్వర్గస్థులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
బాధతప్త హృదయాలతో....


శ్రీమతి పెరమన సుజాతమ్మ గారు

కుమారుడు : పెరమన జీవన్ రెడ్డి
కోడలు : పెరమన స్మిత
కుమార్తె : గడ్డం సుప్రజ అల్లుడు : గడ్డం రుక్మాంగద రెడ్డి
మనుమలు - మనుమరాళ్ళు : సంప్రీత, కల్కిన్, విభున్, విహాన్

పెద్దకర్మ: తేది 09-10-2024 బుధవారం నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం, పుట్టవీధిలోని (రిజిష్ట్రారు ఆఫీసు వీధి) మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
సెల్ : 944 027 9813

తూకాల్లో తేడాలొద్దు !

- ప్రతి కాటాకూ ముద్ర తప్పనిసరి
- ఆరునెలల్లో 275 కేసుల నమోదు
- లీగల్ అండ్ మెట్రాలజి డీసీ ఐసాక్



ఇంటర్వ్యూ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలోని వ్యాపారులు తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడంతోపాటు భారీగా జరిమానా విధించనున్నట్లు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల లీగల్ అండ్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ (డీసీ) అధికారి కే.ఐసాక్ స్పష్టం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్దకు తాము వెళ్లలేము కాబట్టి వ్యాపారులే తమ కార్యాలయానికి వచ్చి కాటాలకు ముద్ర వేయించుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ కాటాలకు ప్రతి సంవత్సరం, రాళ్లకాటాకు రెండేళ్లకో సారి, స్కేల్ కాటాలకు ఐదేళ్లకు ముద్రలు వేయించుకోవా లన్నారు. ముద్ర వేయించుకోకపోతే జరిమానా విధించ నున్నట్లు హెచ్చరించారు. జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు దాదాపు 275 కేసులు నమోదు చేయగా, రూ.25.51 లక్షల వరకు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే ముద్రల ద్వారా రూ.63.66 లక్షల రాబడి వచ్చినట్లు తెలిపారు. ఇక బంగారం విక్రయించేవారు తప్పనిసరిగా ప్రతిరోజూ తమ కాటాను చెక్ చేసుకోవాలని తెలిపారు. బంగారం, రాళ్ల ధరలు, తుకాల్లో తేడాలను బిల్లులో కచ్చితంగా చూపాలని అలా చూపకపోతే తమకు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలను కోరారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులు కూడా ప్రతి సంవత్సరం తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. వచ్చిన ఫిర్యాదులు, తరచూ తాము చేసే తనిఖీల్లో తేడాలు ఉంటే భారీగా జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) పోర్టల్‌లోకి వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేసి ఫిర్యాదు చేయవచ్చని లేదా. జిల్లాలో ఎలాంటి ఫిర్యాదు చేయలన్నా తన నెంబర్‌కు 93981 55484 ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఇసుక రీచ్‌లకు గ్రీన్ సిగ్నల్

- పర్యావరణశాఖ అనుమతుల మంజూరు
- జిల్లా ప్రజలకు తీరనున్న కష్టాలు
- మొదటిగా తెరుచుకోనున్న నాలుగు రీచ్‌లు
- 18 నుంచి తవ్వకాలు



నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 6: ఈనెల 18వ తేదీ నుంచి జిల్లావాసుల ఇసుక కష్టాలు తీరనున్నాయి. పర్యావరణ అనుమతులు రావడంతో ఇసుక రీచ్‌లను ప్రారంభించనున్నారు. మొదటి విడతగా జిల్లాలో నాలుగు రీచ్‌ల్లో తవ్వకాలు చేసేందుకు ఇటీవల జరిగిన డీఎల్‌సీ సమావేశంలో నిర్ణయించారు. దీంతో ఇకపై ఇసుక ప్రజలకు అందుబాటులోకి రానున్నది. ఇప్పటికే పెన్నానదిలో డీసీల్టేషన్ ద్వారా మూడు ప్రాంతాలోని స్టాక్ యార్డుల ద్వారా విక్రయిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి నాలుగు రీచ్‌ల్లో తవ్వ కాలు జరప నున్నారు. దీం తో జిల్లాలో ఇకపై ఏడు స్టాక్ యార్డుల ద్వారా ఇసుక అందుబాటులోకి రానున్నది.

త్వరలో అందుబాటులోకి మరికొన్ని రీచ్‌లు



జిల్లాలో ఇప్పటికే మూడు ప్రాంతాల్లో స్టాక్ యార్డుల ద్వారా ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పర్యావరణ అనుమతులు లేక డీసిల్టేషన్ ద్వారా ఇసుక సేకరించాం. నాలుగు రీచ్‌లకు పర్యావరణ అనుమతులు వచ్చాయి. దీంతో ఈ18 నుంచి నాలుగు రీచ్‌లను ప్రారంభిస్తున్నాం. త్వరలోనే మరికొన్ని రీచ్‌లను అందుబాటులోకి తీసుకొస్తాము.

- చంద్రశేఖర్, మైనింగ్ డీడీ

ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న రీచ్‌ల వివరాలు

రీచ్‌పేరు	ప్రాంతం	రీచ్‌లో ఉన్న ఇసుక(టన్నుల్లో)
మినగల్లు	బుచ్చిరెడ్డిపాళెం	70,350
ముదివర్తిపాళెం 2	ముదివర్తిపాళెం	73,200
పల్లిపాడు	పల్లిపాడు	73,200
విరువూరు	విరువూరు	69,750

గుడ్లూరు జడ్పీటీసీ బలవన్మరణం

- పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ మృతి
- కుటుంబ తగాదాలే కారణం


బాపిరెడ్డి (ఫైల్)

గుడ్లూరు, అక్టోబరు 6: కుటుంబ తగాదాలతో పురుగులమందు తాగి గుడ్లూరు జడ్పీటీసీ కొరిశపాటి బాపిరెడ్డి(48) బలవన్మరణానికి పాల్పడ్డారు. బంధువుల కథనం మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలిచి ఆయన గుడ్లూరు జడ్పీటీసీగా గెలుపొందారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన బాపిరెడ్డి నాలుగురోజుల క్రితం కావలిలోని తన నివాసంలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృదుస్వభావిగా పేరుగాంచిన బాపిరెడ్డి మృతిపై గుడ్లూరు మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన స్వగ్రామం గుండ్లపాలెంలో సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి. స్వగ్రామం గుడ్లూరు మండలం గుండ్లపాలెం అయినప్పటికీ కొంతకాలంగా కావలిలో నివాసం ఉంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గనులు మరియు భూగర్భశాఖ
జిల్లా స్థాయి ఇసుక కమిటీ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా

షార్ట్ టెండరు నోటిఫికేషన్‌కు సవరణ (Corrigendum)
(నెం.2544/DLSC-Sand/NLR/2024, తేది: 06-10-2024)

తేది.06.10.2024న వివిధ ప్రముఖ జిల్లా దినపత్రికల యందు ప్రచురితమైన షార్ట్ టెండరు నోటిఫికేషన్ (నెం.2544/DLSC-Sand/NLR/2024, తేది. 06.10.2024) నందు ప్రచురితమైన షెడ్యూల్‌లో ఇవ్వబడిన ఇసుక రీచ్‌లను సవరణ చేయడమైనది. కావున ఈ సవరణ చేసిన రీచ్‌లను మాత్రమే పరిగణలోకి తీసుకొని టెండరు నోటిఫికేషన్‌ను అనుసరించి ఆసక్తి కలిగిన వారు తేది.07-10-2024న ఉదయం 10.30 గంటల నుండి తేది.16-10-2024 సాయంకాలం 05.00 గంటల వరకు (ప్రతిరోజు కార్యాలయ పని దినములలో మాత్రమే) జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి వారి కార్యాలయము, తల్పగిరి కాలనీ, ఆటోనగర్, నెల్లూరు నందు సమర్పించవలెను. ఈ సీల్డ్ టెండర్‌లను తేది: 17-10-2024న ఉదయం 11.00 గం.లకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యుల సమక్షంలో జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము నందు తెరవబడును మరియు టెండర్లను ఖరారు చేయబడును. దీనికి సంబంధించి పూర్తి వివరముల కొరకు జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి కార్యాలయం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వారిని సంప్రదించగలరు. ఈ టెండర్‌ను వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు పూర్తి అధికారము జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులకు కలదు. ఇందుమూలముగా టెండర్‌లో పాల్గొనదలచిన వారు ఈ విషయం గమనించగలరు. సవరణ చేసిన ఇసుక రీచ్‌లను ఈ క్రింది షెడ్యూల్ నందు తెలియపరుచుచున్నాము.

(ఇసుక త్రవ్వకము (మాన్యువల్), ఇసుక రీచ్ నుండి డిపోలకు/ స్టాక్ పాయింట్లకు ఇసుక త్రవ్వకమునకు ఒక టన్నుకు రూ.90/- మరియు రవాణా (ట్రాక్టర్‌తో మాత్రమే) చేయుటకు 1 కి.మీ.కు టన్నుకు రూ.4.90 పైసలు (GSTతో కలిపి) మరియు డిపో/ స్టాక్ పాయింట్ నుండి లోడింగ్ చేయుటకు గాను రూ.20/- ఒక టన్నుకు నిర్ణయించడమైనది.)

షెడ్యూలు:

క్రమ సంఖ్య	ఇసుక త్రవ్వకములు (మాన్యువల్) చేయవలసిన ప్రాంతము	ప్రదేశము పేరు & వివరములు	ఇసుక త్రవ్వకము చేయవలసిన పరిమాణము (MTs.)
1.	మినగల్లు - IV	మినగల్లు గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం	70,350
2.	పడమటి కంభంపాడు - II	పడమటి కంభంపాడు గ్రామం, అనంతసాగరం మండలం	73,200
3.	పల్లిపాడు - IV	పల్లిపాడు గ్రామం, ఇందుకూరుపేట మండలం	73,200
4.	విరువూరు - III	విరువూరు గ్రామం, పొదలకూరు మండలం	69,750

ఇతర పూర్తి టెండరు వివరముల కొరకు https://spsnellore.ap.gov.in/notice_category/tenders/ లో ఉంచడమైనది.

సం/- ఓ.ఆనంద్, I.A.S.,
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ మరియు
చైర్మన్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

తమలపాకు సాగుకు స్వస్తి

- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటలపై అన్నదాతల దృష్టి

అనంతసాగరం, అక్టోబరు 6 : పెరిగిన పెట్టుబడులతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడంతో లాభాలు లేక తమలపాకు సాగుకు రైతులు స్వస్తి పలుకుతున్నారు. మండలంలోని రేవూరు, శంకరనగరం, కేడీపల్లి గ్రామాల్లో గతంలో సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో తమలపాకు తోటలను రైతులు సాగు చేసేవారు. ఇక్కడ పండించే ఆకులకు మంచి గిరాకీ ఉండేది. కాలక్రమంలో పెట్టుబడులు పెరగడంతో పంటపై ఆదరణ తగ్గింది. ప్రస్తుతం మూడు గ్రామాల నుంచి 50 ఎకరాల లోపే పంట సాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడి నుంచి తమలపాకును బెంగళూరు, చెన్నై పట్టణాలకు ఎగుమతి చేసేవారు. ఆశాజనకపు ధరలతో ఆర్థికంగా నిలదొక్కుకోగా.. నేడు అందుకు భిన్న పరిస్థితి ఏర్పడింది. గడిచిన మూడేళ్లుగా సాగులో అధిక మొత్తంలో ఖర్చులే గాని ఆదాయం తక్కువగా వస్తోందని సాగుదారులు వాపోతున్నారు. పంట సాగుకు తొలుత అవిశ విత్తనాలు చల్లుకోవాలి. ఆతర్వాత తమలపాకు తీగలను అలుముకోవాలి. నాటిన 60వ రోజు నుంచి దిగుబడి చేతికందుతుంది. అంతవరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దిగుబడి చేతికందే వరకు లక్ష రూపాయల వరకు పెట్టుబడులు అవుతాయని, దిగుబడి తగ్గిపోవడం, కూలీలకు, ఎగుమతి ఖర్చులు పెరగడం, మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితితో నష్టాలే మిగులుతున్నాయని రైతులు తమలపాకు తోటలను తీసేసి మామిడి, ఇతర పంటల సాగుపై దృష్టిసారిస్తున్నారు.


రేవూరులోని తమలపాకు తోట

వ్యాధులపై అవగాహన అవసరం

ఆత్మకూరు, అక్టోబరు 6: బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ హాస్పటల్ గుండె వ్యాధుల వైద్యనిపుణుడు డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక షిరిడీ సాయిరామ్ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామం చేయడంతోపాటు మితాహారం తీసుకోవడం మంచిదన్నారు. వైద్యశిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజన, డాక్టర్ ఫిరోజ్‌అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ జనరల్ సెక్రటరీ మహ్మద్ సాధిక్‌హుస్సేన్, జేవీవీ నాయకులు లక్కు కృష్ణప్రసాద్, కామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

కావలిటౌన్, అక్టోబరు 6: స్థానిక బృందావనం కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి సింహ వాహన, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలందించారు. టీటీడీ అర్చక బృందంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజన పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన గ్రామోత్సవంలో చిన్నారులు, మహిళల కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.


సింహ వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

హామీలు అమలు చేయాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న కటారి అజయ్‌కుమార్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 6: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం ఏళ్లతరబడి సాగు, తాగునీటి కష్టాలు ఎదుర్కొవడంతోపాటు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్, సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలన్నారు. ఉదయగిరి-నందవరం, ఉదయగిరి-బండగానిపల్లి రోడ్లను వెంటనే నిర్మించాలన్నారు. ఈనెల 13వ తేదీన ఉదయగిరిలో నిర్వహించే సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు మారలేదు : మాలేపాటి

కావలి, అక్టోబరు 6: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా కొందరు అధికారులు వైసీపీ పాలనలో ఉన్నట్లుగానే వ్యవహరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపించారు. ఈ విషయంపై ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్రతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్యాలయాల్లో ఫొటోలు, కార్యాలయాల రంగులు మార్చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు కావస్తున్నా దగదర్తి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఫొటోలు తాను చెప్పే వరకు మార్చలేదని మండిపడ్డారు. అలాగే కొన్ని సచివాలయాల్లో ఇప్పటికీ జగన్, వైసీపీ నేతల ఫొటోలే ఉన్నాయన్నారు. గతంలో తాను దగదర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్ఐ సుబ్బారావు ఫోన్ బయటపెట్టి రమ్మని చెప్పారన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ నేతలను ముప్పతిప్పలు పెట్టిన అధికారులు కొందరు ఇంకా వైసీపీ ప్రభుత్వం ఉందనే భ్రమలో ఉన్నారని తెలిపారు. నిన్నటి వరకు అధికారంలో ఉండిన వైసీపీలో ఉండిన నేతలు ఇప్పుడు కూటమి గెలిస్తే టీడీపీలోకి రావాలని తహతహ లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మారితే ప్రజలు ఏమనుకుంటారనే సిగ్గు ఉండాలన్నారు. చంద్రబాబు నాయుడుని జైలులో వేసినపుడు సంబరాలు చేసుకున్న వారు, టీడీపీ ఓడిపోతుందని పందాలు కట్టిన వారు నేడు ఎలా వస్తారని ఆలోచించుకోవాలన్నారు. కావలిలో ఒకే ఒక టీడీపీ ఉందని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అయినా నేనైనా ఒకటే అని ఎవరికి అపోహలు వద్దన్నారు.


మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

వరద బాధితులకు వస్తు సామగ్రి పంపిణీ


వస్తు సామగ్రి అందజేస్తున్న కావలి రెడ్‌క్రాస్ చైర్మన్

కావలి, అక్టోబరు 6: రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదివారం విజయవాడ వరద బాధితులకు వస్తుసామగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర పాలకమండలి సభ్యుడు కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవి ప్రకాష్ పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో 1100మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల విలువ చేసే వస్తువులు పంపిణీ చేశామన్నారు. వరద వరద సమయంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వలంటీర్లను పంపి సేవలు అందించామన్నారు. కావలి రెడ్‌క్రాస్ నుంచి ఒక బృందాన్ని పంపి రూ.1.15లక్షల విలువైన మందులు పంపిణీ చేసి వైద్యసేవలు అందించామ న్నారు. త్వరలో నెల్లూరు జిల్లా నుంచి రిలీఫ్ కిట్లు తీసుకుని వెళ్లి వెయ్యి మందికి ఇస్తామన్నారు.

కుల రిజర్వేషన్లు అమలు చేయాలి : పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న సీఎస్ సాగర్

కందుకూరు, అక్టోబరు 6: దేశవ్యాప్తంగా కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీఅధ్యక్షుడు సీఎస్ సాగర్ డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం సందర్భంగా పీడీఎస్‌యూ, భారతకార్మిక సంఘాల సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాగర్ మాట్లాడారు. కుల గణన చేస్తే అంతరాలు లేని సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాలకొండయ్య, సురేష్, సీపీఎం నాయకులు గౌస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్య క్షుడు నాంచార్లు, హరిబాబు, పాలేటి కోటేశ్వరరావు, సుధీర్, జనార్దన్, నాగ య్య పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు, అక్టోబరు 6: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఆటానమస్)లో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 7,8,9 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, బీఏలో స్పెషల్ ఇంగ్లిష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ కోర్సులలో ఖాళీలను ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులో అధ్యాపకుల తోడ్పాటుతో ఒక్కో విద్యార్థికి రూ.2వేలు ఫీజు రాయితీ కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

‘ప్రకాశం’లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరానికి హాజరైన క్యాడెట్లు

కందుకూరు, అక్టోబరు 6: గుంటూరు 34ఏ బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న పదిరోజుల ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలోని కాలేజీలు, పాఠశాలలకు చెందిన 550మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణలో ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఫైరింగ్, డ్రిల్, లీడర్‌షిప్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఉన్నారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 6: ఉదయగిరిలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమికి విలవిల్లాడిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. సాగులో ఉన్న ఆరుతడి, ఉద్యానవన పంటలక వర్షం ఊరటనిచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు పండ్ల పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న రాజ్యలక్ష్మి

బిట్రగుంట, అక్టోబరు 6: బోగోలు పంచాయతీ యాదవ్‌పాలెం నూకసాని శ్రీనివాసులు యాదవ్ స్వగృహం వద్ద ఆదివారం బీజేపీ మండల కన్వీనర్ నూకసాని రాజ్యలక్ష్మి పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజం కోసం పనిచేసే వారు ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామాల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేసుకుని తడి, పొడి చెత్తను అందులో వేస్తే పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

కావలి, అక్టోబరు 6: నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుల్లా నాగరాజు జయంతిని పురస్కరించుకుని ఆదివారం కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో వారి మిత్ర బృందం 27మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే తన కుమారుడు నాగరాజు రోడ్డు ప్రమాదంలో మరణించడం విచారకరం అన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఆయన పుట్టిన రోజుకు కుటుంబసభ్యులు, మిత్రబృందం కలిసి రక్తదానం చేయండ సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో బాలాజీ, సాయి, శశి, బావన, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం


ర్యాలీ చేస్తున్న ధ్యానసాధకులు

వింజమూరు, అక్టోబరు 6: ధ్యానసాధనతో ఆరోగ్యంగా ఆనందమయ జీవనం సాగించవచ్చని గుంటూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ సుబ్బారావు, విజయలక్ష్మీ దంపతులు అన్నారు. ఆదివారం శ్రీవేదవ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

మరమ్మతులకు నోచుకోని జనరేటర్


తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

వలేటివారిపాలెం, అక్టోబరు 6 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లక్షలు విలువ చేసే జనరేటర్ చెడిపోయి మరమ్మతులకు నోచుకోక వృథాగా ఉంది. విద్యుత్ లేని సమయంలో ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ నిధులు వెచ్చించి వీటిని ఏర్పాటు చేస్తే నిర్వహణ నిధులు మంజూరు కాక నిరుపయోగంగా ఉన్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతుంది. సంబంధిత అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

కనులపండువగా ఆదిమాత అలంకరణలు


ఆత్మకూరు: లలితాదేవి అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు


ఉదయగిరి రూరల్ : వారాహిమాత అలంకరణలో సంతానలక్ష్మీదేవి


బిట్రగుంట: లలితాత్రిపురసుందరిగా రాజరాజేశ్వరి అమ్మవారు

ఆత్మకూరు, అక్టోబరు 6: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రోజుకో అలంకారంలో ఆదిమాత దర్శనంతో భక్తజనం పరవశించిపోతున్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్రమ ఆవరణలో అమ్మవారు వనదేవత అలంకరణలో, జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో శోభిల్లారు. శివాలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా ఆలయ పూజారి శివకుమార్‌శర్మ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●**ఉదయగిరి రూరల్ :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మీదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవి, వారాహిమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

●**కావలి టౌన్:** గ్రామదేవత కలుగోళశాంభవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చి నందివాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయంలోని దుర్గాభ్రమరాంబదేవి భువనేశ్వరిగా, విష్ణాలయం రాజ్యలక్ష్మీ అమ్మవారు ధైర్యలక్ష్మిగా, వడ్డెపాలెం కనకదుర్గాదేవి అమ్మవారు గాయత్రిదేవిగా, ముసునూరు మహాలక్ష్మమ్మ లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో దుర్గాదేవికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేపట్టారు.

●**కందుకూరు:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగోరోజుస్థానిక కోవూరు రోడ్డులోని కనకదుర్గ అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దబజారు కన్యకా పరమేశ్వరిని అన్నపూర్ణాదేవి అలంకరించి పూజలు చేశారు. ఆలయాల పూజారులు అమ్మవారికి అభిషేకం, అష్టోత్తరం, అమ్మవారి మూలమంత్ర హోమం నిర్వహించారు.

●**వరికుంటపాడు :** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న శ్రీమానసాదేవి అమ్మవారు ఆదివారం కూష్మాండదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరికుంటపాడులో ఉన్న శ్రీనాగారపమ్మ అమ్మవారు సంతానలక్ష్మిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అలంరించారు.

●**సంగం :** స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కామాక్షిదేవి బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

●**బిట్రగుంట:** విశనాథరావు కోదండరామాలయంలో రాజరాజేశ్వరి లలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ద్వారకానగర్ షిరిడీ శేషసాయి మందిరంలో అల్లూరు చెక్క వెంకటేశ్వర్లు, లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలొ మందిర వ్యవస్థాపకులు బ్రహ్మానందం, సాయి భక్తులు, సేవకులు ఉన్నారు.

●**లింగసముద్రం:** స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని పద్మావతి అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలో ఉభయకర్తలుగా వాల్మీకి సంఘం సభ్యులు ఉన్నారు.

●**కలిగిరి:** తెల్లపాడు గ్రామంలో వెలసిన భద్రకాళి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలో భక్తులు పాల్గొన్నారు.

●**వింజమూరు:** మండలంలోని శ్రీవిద్యాపరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


లింగసముద్రం: అన్నపూర్ణగా పద్మావతి అమ్మవారు


కలిగిరి: సరస్వతీదేవి అలంకరణలో భద్రకాళి అమ్మవారు


వింజమూరు: చండీదేవి అలంకారంలో శ్రీవిద్య పరమేశ్వరి

న్యాయవాది పోట్లూరుకి సత్కారం


పోట్లూరు శ్రీనివాసులును సత్కరిస్తున్న న్యాయవాదులు, సిబ్బంది

కావలి టౌన్, అక్టోబరు 6: ప్రముఖ న్యాయవాది, మాజీ ఏజీపీ టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులుకు ఆదివారం పలువురు నాయకులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ బాధ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా, పూలమాలలతో సత్కరించారు. డీఎస్పీ కార్యాలయం ఎదురువీధిలోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాఘవరావు, లూకాస్‌జోసఫ్, పవన్‌కుమార్, కోమలి, ఝాన్సి, అలేఖ్య, ఎస్‌కె మసూద, సిబ్బంది, విజయ్‌కు మార్, సుధాకర్, ప్రసాద్, శరవణన్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి పురస్కారం

వింజమూరు, అక్టోబరు 6: మండలంలోని గుండెమడకల మెయిన్ పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న ఎర్ర పరమేశ్వర్‌కు ఆదివారం నెల్లూరులోని రోటరీ క్లబ్ ఐపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చెంచలబాబు, వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, బాల చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ట్రస్ట్ సభ్యులు

9 వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, అక్టోబరు 6: స్థానిక సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో ప్రభుత్వ నూతన మద్యం పాలసీకి సంబంధించి స్థానిక కార్యాలయంలో ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదివారం సర్కిల్‌ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ అబ్దుల్ జలీల్ తెలిపారు. ఒక్కొక్కరు ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు తీసుకోవచ్చని, ఒక్కొక్క దుకాణానికి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు నాన్ రీఫండబుల్‌గా జమ చేయాల్సి ఉంటుందన్నారు.


ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ అబ్దుల్ జలీల్

ఐఏఎస్‌లకు ఆదర్శప్రాయుడు ఎస్ఆర్ శంకరన్

లింగసముద్రం, అక్టోబరు 6: దేశంలోని ఐఏఎస్‌లకు ఆదర్శప్రాయుడిగా, పరిపాలనాదక్షుడిగా, పీడిత ప్రజల పక్షపాతిగా పనిచేసిన ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ పలువురికి ఆదర్శప్రాయం అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా పరిపాలన చేసి ప్రజల మన్ననలు పొందిన గొప్ప అధికారి అని కొనియాడారు. ఆయన్ను ఇతర అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 6: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దుత్తలూరులో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు

ఉదయగిరి-గండిపాళెం మార్గంలో రహదారి మార్జిన్లు ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రధానంగా గంగిరెడ్డిపల్లి, మాసాయిపేట, గానుగపెంటపల్లి, సున్నవారిచింతల, వెంగళరావునగర్ గ్రామాల సమీపాల్లో రోడ్డు మార్జిన్‌లు కోతకు గురై రాళ్లతో నిండి ఉన్నాయి. వాహనదారులు గమనించకుండా నడిపితే ప్రమాదం సంభవించే అవకాశముంది. ఈ మార్గంలో అధికంగా ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటాయి. మార్జిన్లు అధ్వాన్నంగా ఉండడంతో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మార్జిన్లకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

— ఉదయగిరి రూరల్


ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిను